WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
RNI: APTEL/2020/79173 జాతీయ తెలుగు దినపత్రిక
www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 107 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | ఆదివారం 7 జూన్ 2026 | వెల : 2-00

# కదం తొక్కిన కాక్రోచ్

- విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి
- ధర్మేంద్ర ప్రధాన్ వారంలోగా రాజీనామా చేయాలి
- కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్... ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా
- ఇతర రాష్ట్రాల నుంచీ పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం
- అమెరికా నుంచి ఢిల్లీకి చేరుకున్న పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే
- ఎవరికీ భయపడబోమని స్పష్టీకరణ
- ఇది దీర్ఘకాల పోరాటం... అన్నింటికీ సిద్ధపడే వచ్చానని వ్యాఖ్య

2లో





## ఎస్ఐఆర్ లిస్ట్‌లో పేరు లేకుంటే రేషన్ కార్డు రద్దు!

- త్వరలో పలురాష్ట్రాల్లో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియ
- లిస్ట్‌లో పేరు లేకుంటే రేషన్ కార్డు రద్దు అయ్యే ఛాన్స్?!

2



## పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- 9 మంది మృతి!
- ఫిరోజ్‌పుర్‌లో ట్రక్కు- కంటైనర్ ఢీ
- 15 మందికి తీవ్ర గాయాలు
- ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించిన పోలీసులు
- కేరళలో టెంపో వ్యాన్, టిప్పర్ ఢీ
- ఇద్దరు మృతి- హరియాణాలో బస్సు ప్రమాదం



## రుతుపవనాలొచ్చేశాయ్


- రాష్ట్రాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు
- రెండు రోజుల్లో మరింత విస్తరించే అవకాశం
- నైరుతి వచ్చినా కొనసాగుతున్న ఎండల తీవ్రత

అమరావతి, స్వర్ణసాగరం

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. శనివారం ఇవి రాయలసీమలోని కొన్ని ప్రాంతాలను తాకినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 4న కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు రెండు రోజుల్లోనే ఏపీకి విస్తరించాయి. అయితే వాతావరణ పరిస్థితులు ఆశాజనకంగా లేకపోవడంతో వాటి గమనం నెమ్మదిగా ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొంది. వచ్చే రెండు, మూడు రోజుల్లో ఇవి రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించినా వర్షాలు మాత్రం తక్కువగానే కురుస్తాయని తెలిపింది. రుతుపవనాల గమనంలో తరచూ విరామాలు ఏర్పడతాయని... కొన్ని రోజులపాటు వర్షాలు కురిసి మరికొన్ని రోజులపాటు వాతావరణం పొడిగా ఉంటుందని తెలిపింది. అందువల్ల ఈ ఏడాది వర్షపాతం సాధారణ స్థాయి కంటే కొంత తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందనీ వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు రుతుపవనాలు ప్రవేశించినా శనివారం రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగింది. కృష్ణా జిల్లా పెదపారుపూడి, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా ఆదివారం 58 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే ప్రమాదం ఉందని, మరో 104 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ తెలిపారు.

## జాబ్ క్యాలెండర్ పేరిట వెన్నుపోటు

- నిరుద్యోగులను వంచించిన వైకాపాకు డీఎస్సీపై మాట్లాడే అర్హత ఎక్కడిది?
- మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాల్ని తిప్పికొట్టాం
- యూనిట్ ఇన్‌ఛార్జులతో 'కాఫీ కబుర్లు'లో పాల్గొన్న అధినేత
- రోండా బర్న్ రాసిన 'ది సీక్రెట్' పుస్తకం ప్రతి కార్యకర్త చదవాలని సూచన
- ఉపాధ్యాయులు, నిరుద్యోగులపై వైకాపాకు కక్ష



అమరావతి, స్వర్ణసాగరం

ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని నిరుద్యోగ యువతను వంచించిన గొడ్డలి పార్టీ నాయకులకు డీఎస్సీ గురించి మాట్లాడే అర్హతే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. మీ ప్రభుత్వంలో ఒక్క ఉపాధ్యాయ పోస్టునైనా భర్తీ చేశారా అని వైకాపా అధినేత జగన్‌ను నిలదీశారు. కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసి 15,941 మందిని ఉపాధ్యాయులుగా నియమించడాన్ని ఓర్చుకోలేకే వైకాపా వారు కుట్రలకు తెరలేపారని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువతలో అలజడులు సృష్టించాలని వారు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయన్నారు. మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాల్ని సమర్థంగా తిప్పికొట్టామని తెలిపారు. ఆధారాలతో సహా ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్లతో జే గ్యాంగ్ కంగు తిందన్నారు. శనివారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇన్‌ఛార్జుల శిక్షణలో భాగంగా 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన సెషన్‌లో చంద్రబాబు పాల్గొని వారితో మాట్లాడారు. - మిగతా3లో

## 'మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు?'



- ప్రధాని నాయకత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు
- దేశంలోని ప్రతి వర్గాన్ని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని కాంగ్రెస్ ఆరోపణ
- మహిళలు, రైతులు, దళితులు, ఆదివాసీల హక్కులు దెబ్బతిన్నాయని ఖర్గే వ్యాఖ్యలు

2

## చుక్క మురుగూ గోదావరిలో కలవకూడదు

- కాలుష్య రహిత పుష్కరాల నిర్వహణే లక్ష్యం
- మునికూడలి ఘాట్‌కు సప్తర్షి పుష్కర ఘాట్‌గా నామకరణం
- కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



అమరావతి, స్వర్ణసాగరం

పంచాయతీల నుంచి వచ్చే మురుగు నీటిలో చుక్క కూడా గోదావరిలో కలవకుండా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. పుష్కరాలు స్వచ్ఛంగా, శుభ్రంగా నిర్వహించేందుకు నది పరిధిలో ఉన్న 268 పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. వాటిని జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలుగా మార్చేలా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని, ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. కాలుష్య రహిత పుష్కరాల నిర్వహణే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. శనివారం ఆయన పుష్కరాలు జరిగే జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో.. 'గోదావరి మోడల్ - మిగతా3లో

# కదం తొక్కిన కాక్రోచ్

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

దేశంలో విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, నీట్(యూజీ)లో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతుదారులు శనివారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు భారీ స్పందన లభించింది. ఇన్నాళ్లూ సోషల్ మీడియా ప్రచారానికే పరిమితమైన ఆ పార్టీ తొలిసారిగా క్షేత్రస్థాయిలో పోరాటానికి దిగింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బొద్దింకల మాస్క్ లు ధరించి, భారత రాజ్యాంగ ప్రతులు, పుస్తకాలు, పువ్వులు, జాతీయ జెండాలు, ప్లకార్డులు చేతపట్టుకొని కదం తొక్కారు. ప్రవేశ పరీక్షలు, ఉద్యోగాల నియామక ప్రక్రియలో జవాబుదారీతనం కోరుతూ నినాదాలు చేశారు. సంస్కరణలు, పారదర్శకత కావాలని తేల్చిచెప్పారు. ధర్నాకు ఇతర రాష్ట్రాల నుంచి జనం వ్యయ ప్రయాసలను సైతం లెక్కచేయకుండా హాజరు కావడం గమనార్హం. పటిష్టమైన భద్రత మధ్య శనివారం ఉదయం ప్రారంభమైన ధర్నా సాయంత్రం వరకు కొనసాగింది.

నీట్(యూజీ) వాయిదా పడడం వల్ల ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. ఇందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీప్కే శనివారం ఉదయం అమెరికా నుంచి ఢిల్లీకి చేరుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని చేతబూని ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చారు. అనంతరం జంతర్‌మంతర్ వద్ద ధర్నా స్థలికి చేరుకున్నారు. అక్కడ ప్రజలను ఉద్దేశించి ఆవేశపూరితంగా ప్రసంగించారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా తమ పార్టీని ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు.

**అన్నింటికీ సిద్ధపడే వచ్చా..**

"ఇది దీర్ఘకాల పోరాటం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నెల రోజుల క్రితం సోషల్ మీడియాలో పోరాటం ప్రారంభించాం. కానీ, సిగ్గులేని పాలకులు ఆయనతో రాజీనామా చేయించకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. మన సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేశారు. పోస్టులు తొలగించారు. మా పోస్టులను తొలగించవచ్చేమో గానీ ఈ విశ్వం నుంచి మమ్మల్ని ఎవరూ తొలగించలేరు. అన్నింటికీ సిద్ధపడే ఢిల్లీకి తిరిగొచ్చా. ఎలాంటి చర్యలు తీసుకున్నా భయపడే ప్రసక్తే లేదు. విమానం దిగడానికి కొద్ది క్షణాల ముందు.. నా స్వేచ్ఛా జీవితపు చివరి క్షణాలను గడుపుతున్నట్లు నాకు అనిపించింది. ఆశయం కోసం నా స్వేచ్ఛను త్యాగం చేయడానికి సైతం పూర్తిగా సిద్ధమయ్యా. కొంతమంది ప్రభుత్వ ఒత్తిడికి లొంగిపోయి ఉండవచ్చు. జైలు శిక్ష పడుతుందనే భయంతో విశ్వాసాలను వదులుకున్నారు. కానీ విద్యార్థులు, యువత అలా ఎప్పటికీ లొంగిపోరు. మేము ఎవరికీ భయపడడం లేదు. నేను అమెరికాకు వెళ్లినప్పటి కంటే స్వదేశానికి తిరిగి వచ్చి?చనప్పుడే నా తల్లి ఎక్కువగా బాధపడింది. నన్ను పోలీసులు అరెస్టు చేస్తారని ఆమె ఆందోళన చెందుతోంది. నా తల్లి మాత్రమే కాకుండా.. రాజకీయాల గురించి మాట్లాడే



ప్రతి యువతీ యుకుకుడి తల్లి భయపడుతోంది. ఇంకెన్నాళ్లు ఇలా భయపడుతూ బతుకుతారు. ఇకపై భయపడబోమని గట్టిగా చెప్పండి"అని అభిజిత్ దీప్కే పిలుపునిచ్చారు.

**నిర్మాణాత్మక మార్పు రావాలి**

పరీక్షల చుట్టూ వివాదాలు, ఫలితాలపై అనిశ్చితి, అధికారుల నుంచి జవాబుదారీతనం లేకపోవడం వంటివి విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తున్నాయని జంతర్‌మంతర్ ధర్నాలో నిరసనకారులు ఆక్షేపించారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు తగిన శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు. అధికార బీజేపీతో పాటు ప్రతిపక్షాల పనితీరుపైనా కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో లోపాలు కేవలం విద్యార్థులకే కాకుండా తల్లిదండ్రులకు సైతం ఆందోళనకరంగా మారుతున్నాయని చెప్పారు. తమ పిల్లల భవిష్యత్తు దెబ్బతింటోందని వారు భయపడుతున్నట్లు పేర్కొన్నారు. దేశంలో జనాభా స్థితిగతుల్లో వస్తున్న మార్పుల గురించి తరచుగా మాట్లాడుతున్నారు తప్ప యువత భవిష్యత్తు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని నిరసనకారులు మండిపడ్డారు. వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పు రావాల్సిందేనని తేల్చిచెప్పారు. ఎక్కువ మంది కలిసి ఒకేసారి గొంతు విప్పితే అది బలంగా వినిపిస్తుందన్న ఉద్దేశంతో ఈ ధర్నాకు హాజరయ్యామని కొందరు స్పష్టంచేశారు.

ఎక్కువ మంది రాజకీయ కోణంలో స్పందించారు. ప్రస్తుత ప్రభుత్వాల పనితీరు నచ్చడం లేదని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ప్రత్యామ్నాయం కావాలని ఆకాంక్షించారు. అవినీతి ప్రతి స్థాయిలోనూ ఉందని, దాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రధానంగా విద్య, యువత ఆకాంక్షలు, పరిపాలన రాజకీయ మార్పుపై 'కాక్రోచ్ జనతా పార్టీ'పేరిట ఆన్‌లైన్ పోరాటం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. జంతర్‌మంతర్ వద్ద ఆరుగురు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతోనే ముందు జాగ్రత్త చర్యగా వారిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

**కాక్రోచ్--ఇన్--చీఫ్ అభిజిత్ దీప్కే**

జంతర్‌మంతర్ ధర్నాలో ప్రముఖ సామాజిక, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సీపీఐ అగ్రనేత ఎ.రాజాతోపాటు పలువురు సామాజిక కార్యకర్తలు, విద్యారి?థ, యువజన సంఘాల సభ్యులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి ఎన్సీపీ(ఎస్పీ)నేత రోహిత్ పవార్ సైతం మద్దతు పలికారు. యువత శాంతియుత నిరసన తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని వాంగ్‌చుక్ అన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి ప్రభుత్వం అనుమతించడాన్ని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. అభిజిత్ దీప్కేను కాక్రోచ్--ఇన్--చీఫ్‌గా వాంగ్‌చుక్ అభివర్ణించారు.

**దేశవ్యాప్తంగా ఉద్యమిస్తాం**

ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి దించేయకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీజేపీ అధికార ప్రతినిధులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ హెచ్చరించారు. వారు శనివారం మీడియాతో మాట్లాడారు. విద్య, పరిపాలన అంశాలపై విస్తృత యువజన ఉద్యమానికి జంతర్ మంతర్ ధర్నా నాంది పలికిందని అన్నారు. ప్రభుత్వానికి వారం రోజులపాటు సమయం ఇస్తున్నామని, ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించడమో లేక ఆయనే స్వయంగా రాజీనామా చేయడమో జరగాలని తేల్చిచెప్పారు. గడువులోగా ప్రభుత్వం స్పందించపోతే మహా ఉద్యమం తప్పదన్నారు. శాంతియుత ప్రదర్శనలు నిర్వహించడానికి సంసిద్ధత వ్యక్తంచేస్తూ వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి తమకు సందేశాలు అందుతున్నాయని తెలిపారు. తదుపరి కార్యాచరణను ప్రకటించే ముందు వారంరోజులపాటు వేచి చూస్తామని పేర్కొన్నారు. శనివారం నాటి నిరసన ప్రదర్శన ఒక ముఖ్యమైన ఘట్టమని వెల్లడించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించడానికి యువత సిద్ధంగా ఉందన్నారు. మన విద్యా వ్యవస్థను సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందని.. ఆ సంస్కరణను తాము మేము ఈ రోజు ప్రారంభించామని ప్రకటించారు. ఇది ఆరంభం మాత్రమేనని, దేశంలో యువతకు ఎన్నో సమస్యలు ఉన్నాయని కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు గుర్తుచేశారు. ఈ దేశంలోని జెన్ జెడ్, యువత రక్తంలో గాన్ధీ, అంబేద్కర్ ఉన్నారని స్పష్టంచేశారు. ధర్మేంద్ర ప్రధాన్ శనివారం సాయంత్రం 5 గంటల్లోగా పదవి నుంచి దిగిపోవాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తొలుత డెడ్‌లైన్ విధించారు. తర్వాత ఆ పార్టీ నిర్వాహకులు డెడ్‌లైన్‌ను వారం రోజులకు పొడిగించారు.

# ఎస్ఐఆర్ లిస్ట్‌లో పేరు లేకుంటే రేషన్ కార్డు రద్దు!

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ముగియగా, త్వరలో తెలంగాణలోనూ ప్రారంభం కానుంది. అయితే, ఎస్ఐఆర్ అనంతరం విడుదల చేసిన ఓటరు లిస్ట్?లో పేరు లేకుంటే రేషన్ కార్డు రద్దయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా బంగాల్‌లో కొలువుదీరిన సువేందు అధికారి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అనర్హులైన లబ్ధిదారులు, అక్రమ విదేశీ పౌరుల రేషన్? కార్డులను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరా శాఖ ఆదేశాలు జారీ చేసింది. 2026 ఓటరు లిస్టులో అనర్హులుగా తేలిన పీడీఎస్ లబ్ధిదారులను గుర్తించి వారి పేర్లను రేషన్ కార్డు నుంచి తొలగించనున్నారు. వాస్తవానికి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జూన్ 4నే విడుదలయ్యాయి. అంతేకాదు, ఈ ప్రక్రియను త్వరితగతిన జూన్? 15 నాటికి పూర్తి చేయాలని కంకణం కట్టుకుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టంగా సూచించింది. రాష్ట్ర ఆహార పంపిణీ వ్యవస్థలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన అక్రమాలను తొలగించేందుకు ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వంలో ఫుడ్ అండ్? కార్పొరేషన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అశోక్? కీర్తానియా, ఆహార శాఖను పూర్తిగా అవినీతి రహితంగా మార్చాలని పిలుపునిచ్చారు. 'ఖాద్య సాథి' పథకం కింద ఏటా ప్రభుత్వం వెచ్చించే వందల కోట్ల రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టకుండా చూడటమే సువేందు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**లిస్టులో పేరు లేకుంటే రేషన్ కట్?!**

అయితే, బంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. అయితే, అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాను సవరించడానికి చేపట్టిన 'ూణణ' (అందుబాటులో లేనివారు, నివాసం మారినవారు, మరణించినవారు లేదా



నకిలీలు) పరిశీలన ప్రక్రియను ఇప్పుడు రేషన్ కార్డుల రద్దుకు ప్రధాన సాధనంగా ఉపయోగిస్తున్నారు. అయితే, అందుకు సంబంధించి ప్రత్యేకంగా ఐదు కేటగిరీల వినియోగదారులను గుర్తించి వారి కార్డులను రద్దు చేయనున్నారు. మొదటిగా 2015 డిసెంబర్ 16 నాటి డ్రాఫ్ట్ లిస్ట్‌లో లేనివారు, ఫామ్-6 ద్వారా జాబితాలో మళ్లీ పేరు నమోదు చేసుకోని వారి కార్డులు రద్దు అవుతాయి. రెండోది, మ్యాపింగ్ చేయకుండా ఉండి, విచారణ తర్వాత తిరస్కరణకు గురైన వ్యక్తులను ఈ జాబితాలో చేరుస్తారు. ఇక, మూడో, నాల్గవ కేటగిరీల కింద, డ్రాఫ్ట్ లిస్ట్ రెండో దశలో మినహాయించిన వారి కార్డులు, న్యాయపరమైన తీర్పు తర్వాత తొలగించిన వారి కార్డులు ఇకపై చెల్లుబాటు కావు. అంతేకాకుండా, 2026 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీలో 'ూణణగా గుర్తించిన వారిని తనిఖీ చేసి కార్డులను రద్దు చేస్తారు.

**కొంతమందికి తాత్కాలిక ఉపశమనం**

అయితే, ఈ కఠిన నిబంధనల నుంచి కొంతమందికి తాత్కాలిక ఉపశమనం లభించనుంది. ఎస్ఐఆర్ ట్రిబ్యునల్‌లో తమ పేరు చేర్చాలని అప్పీల్ చేసుకున్న వారు, లేదా పౌరసత్వ సవరణ చట్టం కింద పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారి రేషన్ కార్డులను ప్రస్తుతానికి అమలులోనే ఉంటాయి. అలాగే వారి దరఖాస్తులు లేదా అప్పీళ్లు పూర్తయ్యే వరకు వారికి ఎప్పటిలాగే రేషన్ సరుకులు అందుబాటులో ఉంటాయి. అయితే, ఈ మినహాయింపు పొందాలంటే లబ్ధిదారులు తమ దరఖాస్తుకు సంబంధించిన సరైన పత్రాలను ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఏరియా ఇన్‌స్పెక్టర్ క్షేత్రస్థాయికి వచ్చి ఈ పత్రాల నిజానిజాలను స్వయంగా పర్యవేక్షిస్తారు. ఒకవేళ వ్యక్తి తన క్లెయిమ్‌కు మద్దతుగా చెల్లుబాటు అయ్యే పత్రాలను సమర్పించడంలో విఫలమైతే, సంబంధిత అధికారి రేషన్ కార్డు రద్దుకు సిఫార్సు చేస్తారు. దాని ఆధారంగా ఉన్నతాధికారులు తుది నిర్ణయం వెలువరిస్తారు.

## దేశవ్యాప్తంగా వానలే వానలు

కేరళలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం వెల్లడించింది. జూన్ 6 నుంచి 12వ తేదీల వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తాజాగా పేర్కొంది. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా కోస్తా ప్రాంతాలు సహా మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, స్థానిక అధికారుల సూచనలు పాటించాలని సూచించింది. ఇక ఈశాన్య భారతంలోని అన్ని ఏడు రాష్ట్రాల్లో జూన్ 12 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అసోం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని పేర్కొంది. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అండమాన్ నికోబార్ దీవులు, బంగాల్ బెంగాల్, సిక్కిం ప్రాంతాల్లో కూడా విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఈ ప్రాంతాల్లో జూన్ 12 వరకు వర్షాలు కొనసాగవచ్చని అంచనా వేసింది.

**భారీ నుంచి అతి భారీ వర్షాలు**

నైరుతి రుతుపవనాల ప్రభావం పశ్చిమ తీర ప్రాంతాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తోంది. కర్ణాటక తీర ప్రాంతాలు, కేరళ, గోవా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో వరుసగా పలురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ఐఎండీ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఆయా రాష్ట్రాల యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మరోవైపు దేశ రాజధాని దిల్లీలో గత కొన్ని రోజులుగా వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. వర్షాలు, ఉరుములు, ఈదురుగాలుల కారణంగా ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తగ్గాయి. శుక్రవారం దిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణ స్థాయి కంటే 4.2 డిగ్రీలు తక్కువ. కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

శనివారం దిల్లీలో పాక్షిక మేఘావృత వాతావరణం కొనసాగుతుందని ఐఎండీ అంచనా వేసింది. తేలికపాటి వర్షాలు, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, మత్స్యకారులు ప్రత్యేక అప్రమత్తత పాటించాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. నైరుతి అరేబియా సముద్రానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, కొన్ని సందర్భాల్లో అవి 65 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని పేర్కొంది.

## పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

పంజాబ్‌లో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పికప్? ట్రక్కు-కంటైనర్ ఢీకొన్న ఘటనలో 9 మంది మృతిచెందారు. 15 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఒక బాలుడు ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ట్రక్కులో దాదాపు 25 మందికి పైగా ఉన్నారని, వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఫాజిల్కా- ఫిరోజ్‌పుర్ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. జలాలాబాద్?లో ఒకే కుటుంబానికి చెందిన సుమారు 27 మంది, తమ కుటుంబ సభ్యురాలి అస్థికలను నిమజ్జనం చేయడానికి అమృత్‌సర్‌లోని దేరా బియాస్?కు శనివారం ఉదయం బయలుదేరారు. అయితే, ట్రక్కు డ్రైవర్? వాహనంపై నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న పికప్ వ్యాన్‌ను ఢీకొట్టాడని, అనంతరం కొంత దూరం ఈడ్చుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**నుజ్జు నుజ్జు అయిన పికప్ ట్రక్కు**

అయితే, సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యల్లో పాల్గొన్నారు. వాహనంలో చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలోనే నలుగురు మరణించారని, మరో నలుగురు ఆసుపత్రికి తరలించే మార్గంలో మృతిచెందారని పోలీసులు తెలిపారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, పోస్టుమార్టం జరుగుతోందని చెప్పారు. అలాగే, గాయపడిన వారిలో కొంతమందిని ఫరీద్?కోట్?కు రిఫర్? చేశారు. అయితే, ప్రమాద తీవ్రతకు పికప్? ట్రక్కు నుజ్జు నుజ్జు అయ్యిందని తెలిపారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**టెంపో వ్యాన్, టిప్పర్ ఢీ**

అలాగే, కేరళలోని మళప్పురం జిల్లాలో మరో ఘటన జరిగింది. టెంపో వ్యాన్, టిప్పర్ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరో 20 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. కోజికోడ్-పాలక్కాడ్ రహదారిపై పెరియంబలం సమీపంలోని పుల్లిక్కల్ వద్ద అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. మృతులు, టెంపో వ్యాన్ డ్రైవర్ రాజు (38), ప్రయాణికురాలు రమణి (65)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ పాలక్కాడ్ నివాసితులని చెప్పారు. అయితే, ప్రమాదానికి గురైన వ్యాన్‌లో సుమారు 25 మంది ప్రయాణికులు ఉన్నారని, వారంతా తీర్థయాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. అయితే, ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో భారీ వర్షం కురుసిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. మరోవైపు, టెంపో వ్యాన్‌లోని 16 మంది ప్రయాణికులు కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చేరారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. టిప్పర్ లారీ డ్రైవర్, అందులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు వ్యక్తులు కొండోట్టిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారని పోలీసులు తెలిపారు. కాగా, ఈ విషయంపై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**హరియాణాలో బస్సు ప్రమాదం- 8 మందికి గాయాలు**

హరియాణాలో బస్సు ప్రమాదం జరిగింది. దిల్లీ నుంచి మనాలికి వెళ్తున్న బస్సు హరియాణాలోని కర్నాల్ జిల్లాలో జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కనీసం ఎనిమిది మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. దిల్లీ-మనాలి వెళ్తున్న వోల్వో బస్సు ఒక ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టిందని, అనంతరం మరో ట్రక్కు, ట్రాక్టర్?ను ఢీకొట్టిందని పేర్కొన్నారు. గాయపడిన వారిని తారావోరి సివిల్ ఆసుపత్రికి తరలించామని చెప్పారు. అయితే, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

## 'మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు?'

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. దేశంలోని అన్ని వర్గాల ప్రజల హక్కులు, ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆరోపించిన కాంగ్రెస్, అసలు మోదీ ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారంటూ ప్రశ్నించింది. మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసీలు, విద్యార్థులు సహా సమాజంలోని ప్రతి వర్గం ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోతోందని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్?లో ఖర్గే పాత ప్రసంగానికి సంబంధించిన ఓ వీడియోను పంచుకుంది. ఆ వీడియోలో రాజ్యసభలో మాట్లాడుతున్న ఖర్గే, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలను విస్మరిస్తోందని ఆరోపించారు. సమానత్వం, సామాజిక న్యాయం వంటి ప్రాథమిక సూత్రాలను పక్కనపెట్టి దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. "మీరు ఎలాంటి భారత్‌ను నిర్మించాలనుకుంటున్నారు? ప్రజల పన్నుల డబ్బుతో అనేక పథకాలు ప్రారంభించి ప్రచారం చేయడం ద్వారా కొంతకాలం ప్రజలను మభ్యపెట్టవచ్చు. కానీ మహిళలు, రైతులు, పేదలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థుల హక్కులను దెబ్బతీశారు. దీంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు" అని ఖర్గే పేర్కొన్నారు. అదే సమయంలో ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కూడా కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇంధన ధరల పెంపును తీవ్రంగా తప్పుబట్టారు.

# జాబ్ క్యాలెండర్ పేరిట వెన్నుపోటు



-మొదటిపేజీ తరువాయి

'కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే క్రీడా పాలసీలో 65 క్రీడలు పెట్టాం. ఉపాధ్యాయ పోస్టులు రానివారు 30 వేలకు పైగా గ్రీవెన్స్‌లు పెడితే.. వారు ఎందుకు ఎంపిక కాలేదో స్పష్టంగా వివరించాం. అప్పట్లో సంతృప్తి చెందినవారిలో ఇప్పుడు అలజడులు రేపాలని వైకాపా నాయకులు కుట్రలు చేస్తున్నారు. వీటిని సమర్థంగా తిప్పికొట్టడంతో డీఎస్సీని ఎందుకు ఎత్తుకున్నామా అని వారిలో ఆందోళన మొదలైంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'గత ఎన్నికల్లో వైకాపా ఓటమిలో ఉపాధ్యాయులు, నిరుద్యోగులు కీలకపాత్ర పోషించారు. అందుకే వారిపై జగన్ కక్ష గట్టారు. వారిలో అసంతృప్తి, భయాందోళనలు రేకెత్తించాలనే ఆయన ఉద్దేశం. నిరుద్యోగులతో రాజకీయాలు చేయాలని గొడ్డలి పార్టీ చూస్తుంటే.. మనం మాత్రం యువతకు ఉద్యోగాలివ్వాలని రేయింబవళ్లు కష్టపడుతున్నాం. డీఎస్సీ విషయంలో ఆ పార్టీ కుట్రల గురించి ప్రజలకు వివరించాలి. క్షేత్రస్థాయిలో వీటిని తిప్పికొట్టాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో వైకాపా బుక్‌లెట్ విడుదల చేయడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు, ఏటా జ్యాబ్ క్యాలెండర్ విడుదల, 23 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహణ, సంపూర్ణ మద్యపాన నిషేధం, చదువుకునే పిల్లలందరికీ అమ్మఒడి వర్తింపు.. ఇలా 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని తుంగలో తొక్కడం వెన్నుపోటు కాదా? అందుకే 151 సీట్ల నుంచి 11కు పడిపోయారు. తల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచిన ఘనత గొడ్డలి పార్టీ అధినేతదే' అని విరుచుకుపడ్డారు.

**మన ఓటు బ్యాంకు 8% పెరిగింది**

'పది రకాల సర్వేలు చేయిస్తున్నాను. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తెదేపాకు గతంలో కంటే 8 శాతం మెజారిటీ పెరుగుతుందని సర్వేల్లో వెల్లడైంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మీ యూనిట్ పరిధిలో పార్టీ మెజారిటీ గతంలో కంటే పెరగాలి' అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రోండా బర్న్ రచించిన 'ది సీక్రెట్' పుస్తకాన్ని ప్రతి కార్యకర్త చదవాలని సూచించారు. 'రహస్యం' పేరుతో ఇది తెలుగులో కూడా అందుబాటులో ఉందన్నారు. మన సంకల్పం బలంగా ఉంటే చేసే పనికి ప్రకృతి, పరిస్థితులు ఎలా సహకరిస్తాయో ఈ పుస్తకంలో రచయిత చక్కగా వివరించారన్నారు. కార్యక్రమంలో తెదేపా మానవ వనరుల విభాగం ఛైర్మన్ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

**ఇకపై తెదేపాకు ఓటమి లేదు.. రాదు**

'యుద్ధాన్ని గెలిపించే బాధ్యత నాది. దానికి అలుపెరగకుండా పోరాటం చేయాల్సింది మీరే. ఇకపై పార్టీకి ఓటమి లేదు.. రాదు.. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాను. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం' అని చంద్రబాబు తెలిపారు. తప్పులు చేసే వారిని, తేడాగా ఉన్న వాళ్లను వదిలించుకుంటానని హెచ్చరించారు. 'కార్యకర్తల్ని నాయకులుగా తయారు చేసేందుకే శిక్షణ ఇస్తున్నాం. మనం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్ని ఇంటింటికీ తీసుకెళ్లండి' అని సూచించారు.

# చుక్క మురుగూ గోదావరిలో కలవకూడదు

-మొదటిపేజీ తరువాయి

పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయా పంచాయతీల్లో సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రైయిన్లతో మురుగునీటిని పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన నిధులు, ఇతరత్రా అంశాలపై ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**జాతీయస్థాయి మోడల్ ఘాట్‌గా మునికూడలి**

'సీతానగరం వద్ద ఉన్న మునికూడలి ఘాట్‌ను జాతీయస్థాయి మోడల్ ఘాట్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనిని సప్తర్షి పుష్కర్ ఘాట్ పేరుతో అభివృద్ధి చేయాలి. ఏకకాలంలో 75 వేల మంది స్నానాలు చేసేందుకు వీలుగా ఈ ఘాట్‌లో ఏర్పాట్లు చేయాలి. సమీప సోమేశ్వరాలయం, వేణుగోపాలస్వామి ఆలయాలను ఆధునికీకరించాలి. ఈ నెలలో జరిగే మంత్రివర్గ సమావేశం తర్వాత మునికూడలి ఘాట్‌ను సందర్శించి, అక్కడ చేయాల్సిన పనులను స్వయంగా పరిశీలిస్తాను. పార్కింగ్ కోసం రైతుల పొలాలను వినియోగించినా, అక్కడి మట్టితీసినా.. పార్కింగ్ ఫీజులో కొంత వాటా రైతులకు ఇచ్చేలా చూడాలి. వారి సహకారంతోనే పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ముందుకెళ్దాం' అని ఉప ముఖ్యమంత్రి సూచించారు. రద్దీపై ముందస్తు అంచనాలు ఉండాలని, దానికి అనుగుణంగా రహదారులు, వస్త్రాలు మార్చుకునే గదులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

**సమష్టి కృషితో పెదపెంకిలో ఫైలేరియాకు చెక్**

అధికార యంత్రాంగం సమష్టిగా పనిచేస్తే, ఎటువంటి సమస్యలైనా పరిష్కరించుకోవచ్చనడానికి పార్వతీపురం మన్యం జిల్లా పెదపెంకి గ్రామంలో చేపట్టిన సమగ్ర అభివృద్ధే నిదర్శనమని పవన్‌కల్యాణ్ తెలిపారు. ఆ గ్రామంలో 197 ఫైలేరియా (బోద కాలు) కేసులు నమోదైతే... ఆ సమస్యను ప్రణాళిక ప్రకారం అధిగమించిన విధానం అభినందనీయమని తెలిపారు. పెదపెంకి గ్రామంలో జరుగుతున్న పనులపై పవన్‌కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 'గ్రామమంతా ఫైలేరియా వ్యాధి బారినపడిందని 2018లో నా దృష్టికి వచ్చింది. గ్రామంలో మురుగునీరు నిలిచిపోయేది. దీనివల్ల క్యూలెక్స్ దోమలు అధికమై, గ్రామస్థులంతా వ్యాధి బారినపడ్డారు. అధికారంలోకి వచ్చాక.. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి డ్రైయిన్ల ఆక్రమణలు తొలగించాం. గ్రామస్థులను ఒప్పించి, ఉపాధి హామీ నిధులతో రూ.6.18 కోట్లతో మ్యాజిక్ డ్రైయిన్లు, సీసీ రోడ్లు నిర్మించడంతో మంచి ఫలితాలు వచ్చాయి. కేసుల తీవ్రత తగ్గింది. గ్రామం ఫైలేరియా రహితంగా మారుతుందన్న గట్టి నమ్మకం ప్రజల్లో కలిగింది. ఇప్పుడక్కడ స్వచ్ఛమైన వాతావరణం కనిపిస్తోంది. త్వరలో గ్రామాన్ని సందర్శిస్తాను' అని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి, జిల్లా యంత్రాంగానికి ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# జగన్ కోసం షర్మిళకు హ్యాండ్



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల చుట్టూ తిరుగుతున్న రాజ్యసభ సీటు వ్యవహారం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తాజా రాజ్యసభ అభ్యర్థుల అధికారిక జాబితాలో ఆమె పేరు లేకపోవడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన సమయం నుండి, ఆమెను కర్ణాటక లేదా ఇతర రాష్ట్రాల నుండి పెద్దల సభకు పంపుతారనే బలమైన ప్రచారం సాగింది. సాక్షాత్తూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రచారం నడిచినప్పటికీ, చివరి నిమిషంలో ఆమెకు మొండిచేయి ఎదురుకావడం వెనుక ఢిల్లీ వేదికగా భారీ హైడ్రామా నడిచినట్లు రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యూహం వల్లనే షర్మిలకు రాజ్యసభ దక్కలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. షర్మిలకు రాజ్యసభ సీటు దక్కితే పార్లమెంట్ వేదికగా ఆమె వాయిస్ మరింత బలంగా వినబడుతుంది. అదే సమయంలో రాష్ట్రంలో మరింత దూకుడుగా ఆమె పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు హోదా లభిస్తుంది. అది ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి దారితీస్తుంది. ఇది అంతిమంగా జగన్ కు నష్టం జరుగుతుంది. ఎందుంటే వైసీపీ ఓటు బ్యాంక్ అంతా.. కాంగ్రెస్ ఓటు బ్యాంకే. దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలు మొదటి నుంచి కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా ఉండేవారు. జగన్ పార్టీ పెట్టుకున్నాక ఆయన వెంట వెళ్లారు. గత ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల వల్లే వైసీపీ అభ్యర్థులు ఓడిపోయారు. ఈ ప్రమాదం గమనించిన జగన్ .. కాంగ్రెస్ బలోపేతం దిశగా అడుగులు వేయకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మొదట్లో ఇండీ కూటమి సపోర్టులో ఢిల్లీలో ధర్నా నిర్వహించారు. ఇటీవల వాఖ్ఫ్ సహా ఇతర అంశాల్లో కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్‌కు ఇస్తున్న సిగ్నల్స్ కారణంగానే షర్మిలకు రాజ్యసభ సీటు చివరి క్షణంలో మిస్ అయినట్లుగా రాజకీయవర్గాలుచెబుతున్నాయి. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమిని గద్దె దించేందుకు లేదా బిల్లుల విషయంలో అవసరమైనప్పుడు తాము ఇండియా కూటమికి మద్దతు ఇస్తామనే బలమైన సంకేతాలు పంపినట్లు ఢిల్లీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇటీవలి కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై జగన్ చేసిన కొన్ని పరోక్ష వ్యాఖ్యలు, పార్లమెంట్‌లో గతంలో లాగా కాకుండా కొన్ని బిల్లుల విషయంలో తీసుకున్న తటస్థ వైఖరి.. కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి ఆయన ఇచ్చిన శాంపిల్స్ అనే చర్చ నడుస్తోంది. షర్మిల వల్ల ఏపీలో కాంగ్రెస్‌కు వచ్చే తాత్కాలిక మైలేజ్ కంటే, జగన్ మోహన్ రెడ్డి ద్వారా జాతీయ స్థాయిలో లభించే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువని కాంగ్రెస్ అధిష్టానం లెక్కలు వేసుకున్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ కేంద్రంలో అధికారం సాధించాలంటే దక్షిణాది సీట్లే కీలకం. ఉత్తరాదిలో ఆ పార్టీ తేలిపోతోంది. దక్షిణాదిలో ఇప్పటికి ఏపీ మినహా అన్నింటిలోనూ కాంగ్రెస్ లేదా మిత్రపక్షాల ప్రభుత్వాలు ఉన్నాయి. ఈ పొలిటికల్ ఈక్వేషన్స్ వల్లే కాంగ్రెస్ హైకమాండ్ షర్మిల సీటు విషయంలో వెనక్కి తగ్గిందని, ఫలితంగా ఆమెకు దక్కాల్సిన పదవి చివరి నిమిషంలో చేజారిందని భావిస్తున్నారు. వైఎస్ కుటుంబంలో మొదలైన ఆస్తి వివాదాలు, ఆరోపణలు ఇప్పుడు ఢిల్లీ పీఠాన్ని కూడా కదిలిస్తున్నాయి. తల్లి విజయమ్మతో ఆస్తి వివాదాలు, కోర్టు కేసులతో ఇబ్బందులు పడ్డ జగన్, ఈ రాజ్యసభ సీటును అడ్డుకోవడం ద్వారా చెల్లి షర్మిలకు గట్టి షాక్ ఇచ్చారని అనుకోవచ్చు. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో ఏపీ కాంగ్రెస్‌లో ఎలాంటి అంతర్గత కలహాలకు దారితీస్తాయో, షర్మిల తన తదుపరి వ్యూహాన్ని ఎలా అమలు చేస్తారో వేచి చూడాలి.

## లైకాతో షావోమి 17టీ విడుదల



స్వర్ణసాగరం విజయవాడ

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ షావోమి ఇండియా, ప్రముఖ కెమెరా బ్రాండ్ లైకాతో కలిసి రూపొందించిన కొత్త ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ షావోమి 17టీను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. అధునాతన ఫోటోగ్రఫీ, శక్తివంతమైన పనితీరు, మెరుగైన డిస్‌ప్లే, దీర్ఘకాలిక బ్యాటరీ సామర్థ్యంతో ఈ ఫోన్‌ను రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. షావోమి 17టీలో లైకా ఆధారిత ట్రిపుల్ కెమెరా వ్యవస్థను అందించారు. ఇందులో 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాతో పాటు 5ఎక్స్ పెరిస్కోప్ టెలిఫోటో కెమెరా ఉంది. సహజమైన చిత్రాలు, మెరుగైన జూమ్ అనుభవం కోసం ప్రత్యేక ఫీచర్లు జోడించారు. ఈ ఫోన్‌లో 6.59 అంగుళాల 1.5కే అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 6500 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ, 67 వాట్ల ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉన్నాయి. 12జీబీ 256జీబీ, 12జీబీ 512జీబీ వేరియంట్లు వరుసగా రూ.59,999, రూ.64,999 ధరలకు లభించనున్నాయి. జూన్ 10 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయి.

## 'హంగర్ ఫ్రీ వరల్డ్' కార్యక్రమ ప్రభావాన్ని వెల్లడించిన మలబార్ గ్రూప్



స్వర్ణసాగరం విజయవాడ

ప్రపంచ ఆకలి దినోత్సవం సందర్భంగా మలబార్ గ్రూప్‌కు చెందిన మానవతా కార్యక్రమం 'హంగర్ ఫ్రీ వరల్డ్' తన ప్రతిరోజు భోజన పంపిణీ కార్యక్రమం ద్వారా వేలాది మంది జీవితాల్లో వచ్చిన మార్పులను వెల్లడించింది. "ఒక రోజువారీ భోజనం ఎలా మారిన జీవితానికి ద్వారం తెరుస్తుంది" అనే నివేదికను విడుదల చేసి, వీధుల్లో జీవిస్తున్న బలహీన వర్గాల వారికి భోజనం మాత్రమే కాకుండా పునరావాసం, వైద్య సహాయం, ఆశ్రయం, కుటుంబాలతో పునఃకలయిక వంటి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. థనల్ సంస్థ సహకారంతో అమలవుతున్న ఈ కార్యక్రమం ప్రస్తుతం భారతదేశంలోని 20 రాష్ట్రాలతో పాటు తొమ్మిది దేశాల్లో కొనసాగుతోంది. మైక్రో లెర్నింగ్ సెంటర్లు, స్ట్రీట్ మీల్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు 1.43 లక్షల మందికి పైగా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పీ. అహమ్మద్ మాట్లాడుతూ, నిరంతరంగా మానవీయ దృక్పథంతో అందించే ఒక భోజనం విశ్వాసాన్ని పెంపొందించి, పునరావాసం, ఆరోగ్య సంరక్షణ, గౌరవప్రదమైన జీవితానికి మార్గం చూపుతుందని అన్నారు. ఆకలి నిర్మూలనతో పాటు సమగ్ర సంక్షేమమే తమ లక్ష్యమని సంస్థ వెల్లడించింది.

## నోటి ఆరోగ్యానికి, చర్మ సమస్యల మధ్య సంబంధం

**- ప్రముఖ ఆరోగ్య నిపుణురాలు డా. సోనియా దత్తా**






స్వర్ణసాగరం విజయవాడ

నోటి ఆరోగ్యం, చర్మ సమస్యల మధ్య సన్నిహిత సంబంధం ఉందని ప్రముఖ ఆరోగ్య నిపుణురాలు డా. సోనియా దత్తా తెలిపారు. చర్మ సంరక్షణపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నప్పటికీ, మొటిమలు, కాంతిహీనత, పదేపదే వచ్చే చర్మ సమస్యలు చాలా మందిని వేధిస్తున్నాయని పేర్కొన్నారు. దీనికి కారణం కేవలం చర్మ సంరక్షణ లోపం కాకుండా, నోటి ఆరోగ్య సమస్యలు కూడా కావచ్చని ఆమె వివరించారు. నోటి పరిశుభ్రతలో నిర్లక్ష్యం కారణంగా బ్యాక్టీరియా పేరుకుపోయి, శరీరంలో స్వల్పస్థాయి వాపు (ఇన్‌ఫ్లమేషన్) ఏర్పడుతుందని, ఇది క్రమంగా చర్మంపై ప్రభావం చూపే అవకాశముందని ఆమె పేర్కొన్నారు. చాలా మంది చర్మ సమస్యలకు పైపూత మందులు, క్రీములపై ఆధారపడుతుంటారని, కానీ సమస్య మూలం నోటి ఆరోగ్యంలో ఉండే అవకాశాన్ని గుర్తించరని చెప్పారు. స్థిరమైన నోటి సంరక్షణ అలవాట్లు పాటించడం ద్వారా బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించడంతో పాటు శరీర అంతర్గత సమతుల్యత మెరుగుపడుతుందని డా. సోనియా దత్తా తెలిపారు. దీని వల్ల చర్మ సంరక్షణ పద్ధతులు, ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు మరింత మెరుగైన ఫలితాలను ఇస్తాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు రోజువారీ ఉపయోగించే టూత్‌పేస్ట్ వంటి ఉత్పత్తుల ఎంపికలో కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయుర్వేద సూత్రాల ఆధారంగా రూపొందించబడిన, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) ఆమోదం పొందిన ఉత్పత్తులు సమగ్ర నోటి సంరక్షణకు ఉపయోగపడతాయని వివరించారు. మొత్తం ఆరోగ్యానికి తోడ్పడే ప్రాథమిక అలవాట్లను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే శారీరక, మానసిక శ్రేయస్సు సాధ్యమవుతుందని, నోటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా చూసుకోవడం ద్వారా చర్మ సమస్యలను కూడా నియంత్రించవచ్చని డా. సోనియా దత్తా సూచించారు.

స్వర్ణసాగరం

# చిన్నారుల సమగ్ర అభివృద్ధే పై శిక్షణ





**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 6**

తోటపల్లి గూడూరు ముత్తుకూరుమండలాలలో ఒక రోజు ా× ఆధారిత స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం .ఐసిడిఎస్ ఆధ్వర్యంలోశనివారం నిర్వహించారుపిల్లల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని,0– 6 సంవత్సరాల లోపు వయసు గల చిన్నారులలో ఎదుగుదల లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు సకాలంలో గుర్తించిన లోపాలను తగు చర్యలు చేపట్టడం ద్వారా పిల్లల భవిష్యత్తును మెరుగుపరిచేందుకు వీలుగా... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI – కృత్రిమ మేధస్సు) ఆధారిత స్క్రీనింగ్ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణా తరగతులకు ముత్తుకూరు మరియు ూ గూడూరు మండలాలలో గల అంగన్వాడీ కార్యకర్తలు హాజరు అయ్యారు..ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు అయిన రీజినల్ జాయింట్ డైరెక్టర్ అయిన బత్తల మనో రంజని మాట్లాడుతూ, చిన్నారులలో అభివృద్ధి లోపాలను మరియు సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత ప్రాముఖ్యమైన విషయమని స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేస్తూ పిల్లలకు అవసరమైన సేవలను సకాలంలో అందించాలని ఆమె పిలుపునిచ్చారు. పిల్లలలో గల అభివృద్ధి మైలురాళ్లు, లోపాల గుర్తింపు, రిఫరల్ విధానం మరియు ా× ఆధారిత ఆధునిక సాధనాలను ఎలా వినియోగించాలనే అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకి కూలంకషంగా వివరించారు.

**పిల్లల ఎదుగుదల లోపాలను స్క్రీనింగ్ చేసే విధానాలు.**

అభివృద్ధి సూచికల (Developmental Indicators) గుర్తింపు.

**డిజిటల్ పద్ధతిలో డేటా నమోదు ప్రక్రియ.**

లోపాలున్న పిల్లలను ఆసుపత్రులకు పంపే రిఫరల్ సేవలు, తదుపరి అనుసరణ (Follow-up) చర్యలు.ఈ AI ఆధారిత కార్యక్రమం ద్వారా జిల్లాలోని చిన్నారులకు మెరుగైన ఉచిత అభివృద్ధి సేవలు అందడమే కాకుండా, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తచేశారు.ఈ కార్యక్రమం లో CDPO లక్ష్మి దేవి, అడిషనల్ CDPO రాజ్యలక్ష్మి, మెడికల్ ఆఫీసర్స్ హేన, దేవి కృప, సూపెర్వైసర్స్ పాల్గొన్నారు

# గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

## ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి

**స్వర్ణ సాగరం పూతలపట్టు 06**

పూతలపట్టు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలు ఈరోజు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా చిత్తూరు ఉభయ జిల్లాల గ్రంథాలయ చైర్మన్ శ్రీ రెడ్డి వారి గురవా రెడ్డి గారు హాజరైనారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో గౌరవనీయులు మాన్యశ్రీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ ఆదేశాల మేరకు ఈ సమ్మర్ క్యాంపు రాష్ట్రమంతా కూడా జరిగిందని చిత్తూరు ఉభయజిల్లాల్లో కూడా చాలామంది విద్యార్థులు ఈ విజ్ఞానాన్ని అందుకు పూతలపట్టు గ్రంథాలయంలో కూడా ఈ విధంగా 40 మంది నేర్చుకోవడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. విజ్ఞాన భాండాగారాలను సద్వినియోగం చేసుకొని విద్యను పంచుకొని చాలా విజ్ఞానవంతులు అయినారని దానికి గ్రంధాల అధికారులు అందరూ కూడా మంచి చేయూతనిచ్చి ఈ 40 రోజులు కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారని కొనియాడారు. సభాధ్యక్షులు ఎంపీడీవో శ్రీ నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు , విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయంలో ఈ సమ్మర్ క్యాంపు జరగడం అందరికీ విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉన్నదని విద్యార్థుల్లో విజ్ఞానాన్ని వెలికి తీసి వారికి నైపుణ్యతను చాటి చెప్పే విధంగా క్లాసులు బాగా జరిగాయని కొనియాడారు. పూతలపట్టు ఎంఈఓ శ్రీ వాసుదేవన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మంచి పుస్తక పట్నం జరగాలని మొదటి రోజు వచ్చి విద్యార్థులు పిలుపునివ్వడం జరిగిందని ఆ తర్వాత విద్యార్థులు అందరూ కూడా రోజుగా వచ్చి ఈ సమ్మర్ క్యాంపు గ్రంథాలయాల్లో జరిగినటువంటి 18 అంశాల పైన నేర్పించినటువంటి ఈ కార్యక్రమాలు అంతా కూడా విద్యార్థులకు బాగా ఉపయోగకరంగా ఉనిందని ప్రతి సంవత్సరం కూడా ఈ విధంగా సమ్మర్ క్యాంపు జరగాలని సూచించారు. అదేవిధంగా ఎంఈఓటు పూతలపట్టు జడ్పీ హైస్కూల్ హెచ్ ఎం శ్రీ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యతను వెలికి చేయడానికి సమ్మర్ క్యాంపు గ్రంథాలయాల్లో మంచి స్థానం సంపాదించిందని గ్రంథాల అధికారులు ఈ విషయంపై చాలా బాగా స్పందించి విద్యార్థులకు ఇసోర్స్ పర్సన్స్ గా కొంతమందిని తీసుకొని ఈ కార్యక్రమానికి విజయవంతం చేయడం చాలా సంతోషమని తెలియజేశారు. డ్రాయింగ్ గాని స్పోకెన్ ఇంగ్లీష్ గాని యోగా గాని అదేవిధంగా హార్ట్ క్రాఫ్ట్ గాని, ప్రత్యేకంగాఇవ్వడం స్పోకెన్ ఇంగ్లీష్ కు స్పెషల్ గా వీళ్ళకి నేర్పించడం విద్యార్థుల్లో పాఠశాలలో చేరే ముందు వీళ్లకు ఒక మంచి హ్యాండ్ రైటింగ్ నేర్పించడం చాలా బాగుందని గ్రంధాలయ అధికారి తాళ్ల రవీంద్రబాబును ప్రశంసించారు . ఈ ఓ పి ఆర్ డి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఈ సమ్మర్ క్యాంపు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం చేయడం సరైనటువంటి విద్యను అందించడం నిజంగా గ్రంథాలయాల ఎంతో గొప్పవని ప్రశంసించారు. ప్రభుత్వ ఆలోచన కూడా చాలా మంచిదని ఎండలకు ఎక్కడ వెళ్లకుండా గ్రంథాలయాల్లో చదవడం తల్లిదండ్రులు ఇష్టమని వారు తెలియజేశారు. నాయకులు మురళి మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని రోజుకి అర్ధ గంట అయినా గ్రంథాలయానికి వెళ్లాలని పుస్తకాలు పట్టణం ఎవరైతే చేస్తారో పత్రికలు ఎవరైతే బాగా చదువుతారు వాళ్ళ మంచి ఉన్నత స్థాయిని అందుకుంటారని మంచి ఉద్యోగాలు సంపాదిస్తారని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. పూతలపట్టు కార్యదర్శి



విద్యార్థుల్లో మంచి నైపుణ్యతను పెంచే విధంగా ఇంగ్లీష్ గ్రామర్ యోగ మెడిటేషన్ క్యారం బోర్డ్,చెస్,ఇలాంటివి కార్యక్రమాలు జరిపినందుకు చాలా సంతోషంగా ఉందని ప్రతి సంవత్సరం ఎలాగైనా జరపాలని వారు పిలుపుని చ్చారు. చివరగా విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో వ్యాసరచన పోటీల్లో సాంగ్స్ పోటీల్లో స్పోకెన్ ఇంగ్లీష్ పోటీల్లో జీకే టెస్ట్ పోటీల్లో గెలుపొందినటువంటి విద్యార్థులకు హాజరైనటువంటి విద్యార్థులకు అందరికి కూడా మెడల్స్ తో సర్టిఫికెట్స్ తో గౌరవనీయులు చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి చేతుల మీదుగా ఎంపీడీవో శ్రీ నాగరాజు చేతుల మీదుగా ఎంఈఓ శ్రీ వాసుదేవన్ చేతుల మీదుగా అదే విధంగా హెచ్ ఎం శ్రీ మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరిగింది గ్రంధాల అధికారి తాళ్ల రవీంద్రబాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులు అందరికి కూడా బహుమతులు అదేవిధంగా స్నాక్స్ పిల్లలకి అన్ని వసతులు కల్పించి అన్నీ కూడా వారందరు కూడా భవిష్యత్తులో గ్రంథాలయాలకు అందరూ కూడా వచ్చి విజ్ఞానాన్ని పొందాలని గ్రంథాలయాల్లో మెంబర్షిప్ తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. రిసోర్స్ పర్సన్ గా శ్రీ నాదముని, ఉపాధ్యాయులు కీర్తి మేడం , శాంతి మేడం , వారికి చైర్మన్ శ్రీ రెడ్డి వారి గురువారెడ్డి వారికి సాలువలతో సన్మానం చేశారు

# మానవత్వం చాటుకున్న కొయ్యలగూడెం మండల జనసేన నాయకులు,జనసైనికులు



**కొయ్యలగూడెం స్వర్ణ సాగరం**

కొయ్యలగూడెం ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఉన్న పాన్ షాప్ షార్ట్ సర్క్యూట్ అయ్యి పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది అని తెలుసుకుని వెంటనే స్పందించి కొయ్యలగూడెం మండల అధ్యక్షులు తోట రవి ఆధ్వర్యంలోషేక్ ఇస్మాయిల్ కుటుంబాన్ని ఓదార్చి 20,000/– రూపాయల కుటుంబానికి ఆర్థికసహాయం అందజేశారు,ఈ కార్యక్రమం లో కొయ్యలగూడెం మండల అధ్యక్షులు తోట రవి మాట్లాడుతూ ప్రతి ఒక్క జన సైనికులు కలిసి వాళ్ళు కు తోచిన ధన సహాయం అందించాలని ఈ సమస్యని ప్రభుత్వం నుంచి ఈ సహాయ సహకారాలు ఉన్న వెనువెంటనే చేపిస్తామని వారికి భరోసా ఇచ్చారు,ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఏపూరి సతీష్,పట్టణ ఉపాధ్యక్షులు చెప్పుల మధుబాబు,పట్టణ ప్రధాన కార్యదర్శి లు మేడిన కన్నయ్య, చవ్వ రాము, సీనియర్ నాయకులు మన్నిడి సాయిబాబా,మట్టా శ్రీనివాస్, కూసుమంచి శ్రీనివాస్ నాయుడు, నక్క బాబి,మడుతూరి శ్రీనివాస్, పూల పల్లి రాజా,గేలం భాస్కర్ రావు,చుక్కల శోభన్ బాబు, ప్రగడ రమేష్,వాడపల్లి రమేష్, గంటా రమేష్,గంటా మురళి, నీలం రాము,మందపాటి రామకృష్ణ,మోదుగు గంగాధర్, దాసరి వినోద్,అమిరిశెట్టి దిలీప్, వెంకటేశ్వరరావు,మరియు జనసేన నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

# సీపీఐ జాతీయ నేత కె.నారాయణను కలిసిన డాక్టర్ పోతుకుంట మల్లికార్జునరావు



**మనుబోలు, స్వర్ణ సాగరం:**

నెల్లూరు జిల్లా, చిల్లకూరు మండలంలోని దర్గా ఏరియాకు చెందిన సీపీఐ జాతీయ నాయకులు కంకణాల నారాయణ ను, 'పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్' అధ్యక్షులు డాక్టర్ పోతుకుంట మల్లికార్జునరావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరావు, ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం, స్థానిక ప్రాంతంలోని పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో చిల్లకూరు అరుణబాబుతో పాటు పలువురు స్థానిక ప్రముఖులు ప్రజలు పాల్గొన్నారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# కరెంట్ షాట్ సర్క్యూట్ వలన పాన్ షాప్ దగ్ధం



**కొయ్యలగూడెం స్వర్ణ సాగరం**

పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం గ్రామంలో శుక్రవారం అర్థ రాత్రి కరెంట్ షార్ట్ సర్క్యూట్ వలన ఇస్మాయిల్ అనే వ్యక్తి కిరాణా షాప్ పాన్ షాప్ దగ్ధమైంది,ఈ షార్ట్ సర్క్యూట్ వలన సుమారు 5 లక్షలు ఆర్థిక నష్టం జరిగిందని,ఈ విషయం తెలుసుకున్న ఏపీ స్పోర్ట్స్ అథారిటి డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, షార్ట్ సర్క్యూట్ అయిన షాపులను సందర్శించారు,ప్రమాదనికి గల కారణాలను తెలుసుకుని ఇస్మాయిల్ కి ధైర్యం చెప్పారు,మాజీ టౌన్ ప్రెసిడెంట్ సీనియర్ నాయకులు జ్యేష్ఠ రామకృష్ణ, విద్యుత్ శాఖ ఏ ఈ,రాచూరి మదన్, ఉప్పాటి వెంకట్రావు,సంకు కృష్ణ, రంగా,తదితర కూటమి నాయకులు పాన్ షాప్ ను సందర్శించారు తమ వంతు సహాయంగా ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి 10,000 రూ ఆర్థికంగా సాయంచేసి భరోసా కలిగించారు.

# "మై టిడిపి యాప్ లో" "ప్రథమ స్థానం "పొందిన టిడిపి

## యువ నేత "దొడ్ల" ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం

## పలువురి అభినందనలు



**ఇందుకూరుపేట స్వర్ణ సాగరం జూన్ 6**

కోవూరు నియోజకవర్గ టిడిపియువత ఉపాధ్యక్షులు దొడ్ల మల్లికార్జున్ మై టిడిపి యాప్ లో అత్యుత్తమ ప్రతిభ కారణంగా నెంబర్ వన్ స్థానం సంపాదించారు. మల్లికార్జున్ టిడిపిలో క్రమశిక్షణ గల నేతగా అనేక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ టిడిపి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి అత్యంత విధేయులు మల్లికార్జున్ మై టిడిపి యాప్ లో ప్రథమ స్థానం సాధించడం పట్ల నియోజకవర్గ యువత ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత రాణించాలని వారు ఆకాంక్షించారు

# నవ చేతన ఏఐ యాప్

## నవ చేతన యాప్ పై అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ

## ఐరాల సిడిపిఓ నిర్మల





**స్వర్ణ సాగరం పూతలపట్టు 06**

పూతలపట్టు మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణా తరగతులు.ఐరాల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పూతలపట్టు మండలంలో సిడిపిఓ నిర్మల ఆదేశానుసారం మండల ట్రైనింగ్ 6 సంవత్సరాల పిల్లల పైన వారి పోషకాల పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూతలపట్టు పిహెచ్సి డాక్టర్ ప్రియాంక పిల్లల్లో జరిగే అభివృద్ధి దశలను గురించి మూడు సంవత్సరాలలో జరిగే బ్రెయిన్ డెవలప్మెంట్ గురించి మరియు పుట్టుకతో వచ్చే వ్యాధులను గురించి వివరించారు. సూపర్వైజర్లు భారతి, రమాదేవిలు నవ చేతన యాప్ గురించి పిల్లలు జరిగే అభివృద్ధి దశలను గురించి వివరించారు. సూపర్వైజర్లు భారతి రమాదేవి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిట్వేలి మండల తహసీల్దార్‌గా ఎస్.వి. నరసింహారావు బాధ్యతల స్వీకరణ




తిరుపతి జిల్లా చిట్వేలి మండల తహసీల్దార్‌గా ఎస్ వి నరసింహారావు బాధ్యతలు స్వీకరించారు, తిరుపతి కలెక్టరెట్ లో విధులు నిర్వహిస్తున్న అయన సాధారణ బదిలీ పై చిట్వేలి కు వచ్చారు, గతం లో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ స్పందన కెవిబీ పురానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో నరసింహారావు నియమితులయ్యారు,ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు రెవెన్యూ సేవలను పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు కృషి చేస్తామని, భూ సంబంధిత సమస్యలు, పౌర సేవలకు సంబంధించిన దరఖాస్తులను నిర్దేశిత గడువులో పరిష్కరించే విధంగా ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

## శ్రీ భగవాన్ వెంకయ్య స్వామికి ప్రత్యేక పూజలు

మనుబోలు, స్వర్ణ సాగరం:



మనుబోలు చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన వెలసి ఉన్న శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారి యొక్క దేవస్థానం వద్ద శనివారం సందర్భ ంగా వెంకయ్య స్వామివారికి పంచామృత అభిషేకం నూతన పట్టు వస్త్రాల సమర్పణ మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాలకు ఉభయ దాతలుగా గంధళ్ళ కృష్ణ య్య అన్నపూర్ణమ్మ వ్యవహరిం చారు ఆలయ అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

## సుభాష్ చంద్రబోస్ సేవా సంఘం వారిచే నిత్యవసర సరుకులు అందజేత



కొయ్యలగూడెం స్వర్ణ సాగరం

ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఉన్న షేక్ ఇస్మాయిల్ ఇల్లు కరెంటు షార్ట్ సర్క్యూట్ వలన పాన్ షాప్ దగ్ధమైంది నేతాజీ ఆర్థికసహాయంతో 5000 రూపాయల విలువైన నిత్యావసర సరుకులను ఇస్మాయిల్ కుటుంబానికి అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ముప్పిడి చినబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారినీ ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో సభ్యులు రాచూరి మదన్, మజ్జి చిరంజీవి,కొడపాక పాండు,గున్నేపల్లి సుబ్బారావు,చవ్వా రాము, గొలిశెట్టి ప్రసాద్, ప్రేమ్ సూరిబాబు,వాగు సారథి, షేక్ రియాజ్ ఖాన్,దూలపల్లి ప్రసాద్,తదితరులు సహకరించారు.

## మండలానికి తొలి విడతగా 15 టన్నుల పశువుల దాణా



**ముత్తుకూరు..**రాష్ట్ర ప్రభుత్వం 2026--27 ఆర్థిక సంవత్సరానికి తొలి విడతగా మండలానికి 15 టన్నుల పశువుల దాణాను కేటాయించింది. ఈ దాణాను రైతు సేవా కేంద్రాల ద్వారా అర్హులైన పాడి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తున్న ఈ పశువుల దాణాలో 50 కిలోల బస్తాను రూ.550 కి రైతులకు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ముత్తుకూరు (ఏడీ) నిర్మల మాట్లాడుతూ, 2025--26 సంవత్సరంలో మండల వ్యాప్తంగా 25 టన్నుల 150 కిలోల పశువుల దాణాను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 2026--27 సంవత్సరానికి తొలి విడతగా వచ్చిన 15 టన్నుల దాణాను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామని, అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## పంటపల్లెలో పల్లెనిద్ర

సీ ఐ గోపి



స్వర్ణ సాగరం పూతలపట్టు 06

పూతలపట్టు మండలం, పంటపల్లి గ్రామము నందు "పల్లెనిద్ర" కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా ధైర్య-స్పర్శ , మహిళలు చిన్నపిల్లలు పట్ల జరిగే నేరాలు, సైబర్ క్రైమ్స్, మాదకద్రవ్యాల వినియోగం మరియు దాని వలన కలిగే నష్టాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాలు యొక్క ఉపయోగం మరియు పోలీసులు- ప్రజల మధ్య స్నేహపూర్వకమైన సంబంధముల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమమునందు సుమారు 100 మందికి పైగా మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిడతా పోలూరు మామిడి జోరు





## సహజంగా పండిన చెట్టు పండ్లకు పెరుగుతున్న ఆదరణ

ముత్తుకూరు.. స్వర్ణ సాగరం

వేసవి సీజన్ చివరి దశలోకి అడుగుపెట్టడంతో మండలంలోని పిడత పోలూరు మామిడి తోపు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. మే నెలాఖరు నుంచి జూలై నెలాఖరు వరకు దాదాపు రెండు నెలల పాటు ఇక్కడ వివిధ రకాల మామిడి పండ్లు లభిస్తుండటంతో ప్రతి రోజు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు.బంగినపల్లి, కేసరి, పందూరి, నీలం, అంటు మామిడి, చెరుకు రసాలు, ఊరగాయల మామిడి, పచ్చళ్ళ మామిడి, తదితర రకాల మామిడి పండ్లకు పిడతాపోలూరు తోపులు ప్రసిద్ధి చెందాయి. ముత్తుకూరు మండలంలోని గ్రామాలతో పాటు చుట్టుపక్కల పంచాయతీల ప్రజలు ఉదయం ఆరు గంటలకే తోటలకు చేరుకుని తమకు నచ్చిన పండ్లను కొనుగోలు చేస్తున్నారు.ఇక్కడి మామిడి పండ్లకు ప్రత్యేక గుర్తింపు రావడానికి ప్రధాన కారణం సహజసిద్ధంగా చెట్టుకు పండిన పండ్లే ఎక్కువగా లభించడం. రసాయన పౌడర్లు, కృత్రిమ పక్వీకరణ పద్ధతులు లేకుండా పండిన పండ్లతో పాటు గాలికి రాలి పడిన పండ్లు కూడా దొరుకుతుండటంతో వినియోగదారులు వాటిని ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. సహజమైన తీపి, సువాసన, రుచితో ఈ పండ్లు మంచి ఆదరణ పొందుతున్నాయి. మండల పారిశ్రామిక ప్రాంతంతో పాటు ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా కుటుంబ సభ్యులతో వచ్చి మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్నారు. వారాంతాల్లో అయితే తోటల వద్ద సందడి మరింత పెరుగుతోంది.

అంతేకాకుండా ముత్తుకూరు మండలానికి మాత్రమే కాకుండా ఇతర మండలాల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా ఇక్కడి నుంచి బాక్సుల కొద్దీ మామిడి పండ్లు కొనుగోలు చేసి తమ గ్రామాలకు తరలిస్తున్నారు. ఆటోలు, చిన్న వాహనాల్లో గ్రామ గ్రామానికి వెళ్లి విక్రయించే వ్యాపారులు ఎక్కువగ ఈ తోటల నుంచే పండ్లు సేకరిస్తున్నారు. నాణ్యమైన పండ్లు అందుబాటు ధరల్లో లభిస్తుండటంతో ఈ ప్రాంతం చిన్న వ్యాపారులకు కూడా ప్రధాన కేంద్రంగా మారింది. సహజమైన చెట్టు పండ్ల రుచి కోసం వినియోగదారులు ఎదురుచూసే ప్రాంతంగా పేరుగాంచిన పిడతాపోలూరు మామిడి తోపులు, ఈ సీజన్‌లో రైతులకు ఉపాధి కల్పించడమే కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తున్నాయి. మామిడి సీజన్ వచ్చిందంటే ఈ ఊరు గుర్తుకొచ్చేలా ఈ తోపులు ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నాయి.

## కార్మికులు ఉచితంగా న్యాయ సేవ పొందవచ్చు.

సీనియర్ సివిల్ జడ్జి వై జె పద్మశ్రీ.




ముత్తుకూరు.. స్వర్ణ సాగరం

భారత ప్రభుత్వం ద్వారా కార్మికులు ఉచిత న్యాయ సేవ పొందే అవకాశం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వై జె పద్మశ్రీ అన్నారు. శనివారం అదని కృష్ణపట్నం పోర్టు నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవ శిబిరం ప్రారంభం కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి జడ్జి విచ్చేసి ఉచిత న్యాయ సేవ గురించి తూర్పు ఉత్తర రాష్ట్రాల కార్మికులకు క్షేత్రస్థాయిలో సమగ్రమైన విషయాలు తెలియజేశారు. బడుగు బలహీన వర్గాలతో పాటు మహిళలకు ఉచిత న్యాయ సేవ పొందవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు

## వాకాడులో వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాల్లో మార్పులు

స్వర్ణసాగరం వాకాడు




వాకాడు మండల విద్యుత్ శాఖ నుండి విడుదలైన ప్రకటన ప్రకారం, రేపటి నుండి వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాల్లో కొత్త సవరణలు అమలులోకి రానున్నాయని కొత్త షెడ్యూల్ ప్రకారం ఏ-గ్రూప్‌కు సంబంధించి ఉదయం 08:15 గంటల నుండి సాయంత్రం 05:15 గంటల వరకు, బీ-గ్రూప్‌కు సంబంధించి ఉదయం 08:30 గంటల నుండి సాయంత్రం 05:30 గంటల వరకు విద్యుత్ అందించబడుతుందని. గతంలో ఏ-గ్రూప్‌కు ఉదయం 07:30 నుండి 04:30 వరకు సరఫరా ఉండేదని ఈ మార్పులను మండల రైతులు గమనించి, వ్యవసాయ పనులను అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళం

### యాదవుల ఆరాధ్య దైవం ఆలయ అభివృద్ధికి మాలోత్ నెహ్రూ నాయక్ చేయూత



స్వర్ణ సాగరం డోర్నకల్ జూన్ 06

డోర్నకల్ పట్టణంలోని యాదవుల ఆరాధ్య దైవం శ్రీ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు రాష్ట్ర ఫైనాన్స్ సభ్యుడు మాలోత్ నెహ్రూ నాయక్ రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందించి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణలో భాగంగా ఈ విరాళాన్ని డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మాలోత్ నెహ్రూ నాయక్ మాట్లాడుతూ, గంగమ్మ తల్లి ఆలయం యాదవ సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని, ఆలయ నిర్మాణం పూర్తి కావడం ద్వారా భక్తులకు మరింత సౌకర్యాలు కలుగుతాయని అన్నారు. సమాజ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని పేర్కొన్నారు.యాదవ సంఘ నాయకులు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన మాలోత్ నెహ్రూ నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని అందరూ ఆకాంక్షించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు కొండంత అండ

పూతలపట్టు శాసనసభ్యులు మురళి మోహన్

స్వర్ణ సాగరం పూతలపట్టు 06



పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) కొండంత అండ!పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ఈరోజు గౌరవనీయులైన పూతలపట్టు శాసనసభ్యులు డా. కలికిరి మురళీ మోహన్ గారు జవీ=ఖీ చెక్కులను పంపిణీ చేశారు.వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 41 మంది బాధితులకు సుమారు రూ. 23 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను చేతులమీదుగా అందించి, వారి కుటుంబాలకు ధైర్యాన్ని ఇచ్చారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు గారు మాట్లాడుతూ.. నిరుపేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే కాకుండా, ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న మన గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా ఎల్లప్పుడూ కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 6/6/2026 11:14 PM Page 3



# కార్యకర్తలే పార్టీకి బలం - పాశం సునిల్ కుమార్





స్వర్ణసాగరం చిట్టమూరు

తెలుగుదేశం పార్టీ కార్యకర్త గూడూరు నియోజకవర్గం ఎస్సి సెల్ అధికార ప్రతినిధి యల్లసిరి నాగార్జున పుట్టినరోజు సందర్భంగా గూడూరు శాసన సభ్యులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం సునీల్ కుమార్ గూడూరు లోని అయన నివాసం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియచేసారు.ఈసందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ,పార్టీ బలం కార్యకర్తలేనని,వారు కష్టపడి పని చేయడం వల్లే పార్టీ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ద్వారా కార్యకర్తలకు మరింత ఉత్సాహం కలుగుతుందని,పార్టీ పట్ల వారి నిబద్ధత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.సునిల్ కుమార్ కు నాగార్జున్ కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగార్జునకు అభినందనలు తెలిపారు.

## శ్రీకాళహస్తి కోర్టు సమస్యలపై జిల్లా జడ్జికి బార్ అసోసియేషన్ వినతి

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్



శ్రీకాళహస్తి, జూన్ 6: శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు చిత్తూరులో జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి కోర్టుకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి కోర్టులో తగిన సంఖ్యలో న్యాయమూర్తులు లేకపోవడంతో కేసుల పెండింగ్ పెరుగుతోందని పేర్కొంటూ, ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను వెంటనే భర్తీ చేసి న్యాయ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా కోర్టు భవనంలో లిఫ్ట్ సౌకర్యం లేకపోవడం వల్ల కక్షిదారులు, న్యాయవాదులు రెండు అంతస్తులు ఎక్కి దిగడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించి, లిఫ్ట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్‌కు ప్రత్యేక భవనం లేకపోవడంతో, బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి అవసరమైన చర్యలు చేపట్టా లని జిల్లా జడ్జిని కోరారు.ఈ వినతులపై జిల్లా జడ్జి సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరంభాకం మునిప్రసాద్, ఉపాధ్యక్షుడు కాకి చిన్న అంకయ్య, కార్యదర్శి తులసీరామ్, సీనియర్ న్యాయవాదులు కన్నలి ప్రభాకర్ రెడ్డి, కె. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్మారక ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఘన ముగింపు





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో క్రీడా స్ఫూర్తిని మరింత పెంపొందిస్తూ, స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్మారకార్థం శ్రీకాళహస్తి మండలి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్" ముగింపు మరియు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఆర్‌పీబీఎస్ జెడ్పీ బాయ్స్ హైస్కూల్ మైదానంలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక పోటీల ముగింపు వేడుకలకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి క్రీడలను, క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహించేవారని, వారి ఆశయాలను కొనసాగిస్తూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలు, మెమొంటోలు, బహుమతులను అందజేసి అభినందించారు. దేశవ్యాప్తంగా పాల్గొన్న క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ పోటీలను ఉత్కంఠభరితంగా మార్చారు.ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు, సహకరించిన కూటమి నాయకులకు, క్రీడాభిమానులకు మరియు స్వచ్ఛంద కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.క్రీడల అభివృద్ధికి, యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు మరిన్ని నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు

## నీట్ పరీక్ష లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: ఏఐఎస్ఎఫ్

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్



న్ 6: నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆందోళనల్లో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ, మే 4న నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షకు 22.75 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు రెండేళ్ల పాటు కష్టపడి చదివి, భారీగా ఖర్చు చేసి కోచింగ్ తీసుకొని పరీక్ష రాశారని పేర్కొన్నారు.పరీక్షా పత్రం లీక్ కావడం వల్ల పరీక్షను రద్దు చేయాల్సి రావడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల సమయం, డబ్బు, శ్రమ వృథా అయ్యాయని విమర్శించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ఆరోపించారు.వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజ్ ఘటనలు ఎన్‌టీఏ పనితీరుపై తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొంటూ, దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏను రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి శివ, అధ్యక్షుడు అభి, పట్టణ నాయకులు సాయి కృష్ణ, అర్జున్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్‌లో దందా?..

## సచివాలయం-2లో గోల్‌మాల్ బాగోతం!

### రూ.1,000 పంపితే రూ.500కే డీజిల్ పట్టించినట్లు ఆరోపణలు

### పూర్తి బిల్లులు చూపించి ప్రభుత్వ నిధుల దారిమళ్లింపుపై అనుమానాలు

### ఇంటి పన్నుల అసెస్‌మెంట్‌లోనూ మామూళ్ల వసూళ్లపై ఫిర్యాదులు

### ఉన్నతాధికారుల విచారణకు గ్రామస్తుల డిమాండ్

స్వర్ణసాగరం- తొట్టంబేడు,





తొట్టంబేడు గ్రామ సచివాలయం-2 పరిధిలో ప్రభుత్వ నిధుల వినియోగంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ కోసం వినియోగించే ట్రాక్టర్ల డీజిల్ కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయంటూ గ్రామస్తులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిధులు ప్రజా అవసరాలకు కాకుండా దుర్వినియోగం అవుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి .తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ట్రాక్టర్‌కు డీజిల్ పట్టించేందుకు రూ.1,000 నగదు అందజేసినప్పటికీ కేవలం రూ.500 విలువైన డీజిల్ మాత్రమే కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగిలిన మొత్తాన్ని స్వాహా చేసి, రికార్డుల్లో మాత్రం పూర్తి మొత్తానికి డీజిల్ కొనుగోలు చేసినట్లు చూపిస్తూ బిల్లులు నమోదు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.గ్రామస్తుల కథనం ప్రకారం ఇది ఒక్క ఘటన మాత్రమే కాదని, గత కొంతకాలంగా ఇదే తరహా వ్యవహారం కొనసాగుతోందని చెబుతున్నారు. డీజిల్ కొనుగోలు బిల్లులు, ట్రాక్టర్ల వినియోగ రిజిస్టర్లు, చెల్లింపుల వివరాలను పరిశీలిస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని అంటున్నారు.ఇదిలా ఉండగా, కొత్త ఇళ్లకు పన్నుల అసెస్‌మెంట్ ప్రక్రియలో కూడా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల మేరకు జరగాల్సిన ప్రక్రియకు కొందరు సిబ్బంది వేల రూపాయలు మామూళ్ల రూపంలో డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.ప్రభుత్వం అవినీతి రహిత పాలన, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో గ్రామ సచివాలయం స్థాయిలో ఇలాంటి ఆరోపణలు వెలుగులోకి రావడం గమనార్హం. జిల్లా పంచాయతీ అధికారులు, డీపీవో, ఎంపీడీవో, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డీజిల్ కొనుగోళు,, ఇంటి పన్నుల అసెస్‌మెంట్ రికార్డులపై ప్రత్యేక విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు."ప్రభుత్వ ధనం ప్రజల ధనం... దాని వినియోగంపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తేవాలి" అని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పిల్లల ఎదుగుదలపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి..

- సిడిపిఓ పిజె డి శోభారాణి





శ్రీరంగరాజపురం :స్వర్ణ సాగరం: జూన్ 7:

నవ చేతన పిల్లలపై... ప్రతి అంగన్వాడీ కార్యకర్త... వారి ఎదుగుదల మానసిక దృక్పథం మెదడు పనితీరు వివిధ కోణాలను పరిశీలించి... వారి అలవాట్లు మేరకు ఆటపాట్ల ద్వారా శిక్షణ ఇవ్వాల్సి ఉందని సిడిపిఓ పి జె డి శోభారాణి తెలిపారు. శనివారం మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో అంగనవాడి కార్యకర్తలకు నవచేతన ఏవే స్క్రీనింగ్ యాప్ పై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ 0-3 వయస్సు గల పిల్లల మానసిక దృక్పథంపై పర్యవేక్షణ తప్పనిసరన్నారు.పిల్లల వృద్ధి, వారి మేధోశక్తి పై ఈ యాప్ ద్వారా నిర్ధారించవచ్చని సూచించారు. స్థానిక వైద్యాధికారుల పర్యవేక్షణలో పిల్లల మానసికం పై అధ్యయనం చేయాలని, అలాగే వారి వారి అలవాట్లు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## శేషాపురం వద్ద వరికోత బండి డీ కొని వ్యక్తి మృతి

బంగారుపాలెం.స్వర్ణ సాగరం. జూన్ 6



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని చెన్నై బెంగళూరు జాతీయ రహదారి శేషాపురం సర్వీస్ రోడ్డు వద్ద శనివారం ఉదయం వరికోత యంత్రం బండి ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది వివరాలు ఇలా ఉంది బంగారుపాలెం బీసీ కాలనీకి చెందిన పద్మనాభ రెడ్డి కుమారుడు జయశంకర్ రెడ్డి 40 సం లు తన పని నిమిత్తం శేషాపురం గ్రామానికి పోతుండగా ఎదురుగా వస్తున్న వరికోత యంత్రం బండి డీ కొని జయశంకర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు జయశంకర్ రెడ్డి భార్య రోజ రాణి ఫిర్యాదు మేరకు బంగారుపాలెం అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులు మృతి చెందిన జయశంకర్ రెడ్డి మృత దేహన్ని బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రి తరలించి పోస్టు మాస్టమ్ అనంతరం మృతిని బందువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి:

ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య.




నల్లగొండ:స్వర్ణసాగరం,జూన్06:

నల్లగొండ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ,పాఠశాలల ప్రారంభం దృష్ట్యా మరియు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు భారీ వాహనాలు లారీలు, ట్రాక్టర్లు, రాకపోకలపై ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ.మహా లక్ష్మయ్య తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియమాలను ప్రతి వాహనదారుడు కచ్చితంగా పాటించాలని.పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు భారీ వాహనాల ప్రవేశాన్ని నియంత్రిస్తూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు భారీ వాహనాలకు పట్టణ పరిధిలో అనుమతి ఉండదని స్పష్టం చేశారు.నిర్ణీత సమయాలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే వాహనాలు నడిపేటప్పుడు లైన్ డిసిప్లిన్ పాటిస్తూ,ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపరాదని తెలిపారు.ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం,అనధికారిక పార్కింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైతే డ్రైవింగ్ లైసెన్సుల రద్దు, వాహనాల సీజ్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలి. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు ప్రజలను కోరారు.

## కిషోర్ బాలికలకు చైతన్య బాట,

ఆరోగ్యం, విద్య, పోషకాహారంపై అవగాహన,

ఐవీఆర్ సేవల వినియోగంపై వివరించిన ఐసీడీఎస్ అధికారులు,

స్వర్ణసాగరం- కెవిబి పురం,



సీడీపీఓ సౌభాగ్యమ్మ ఆదేశాల మేరకు కేవీబీ పురం మండలంలోని ఆదరం గిరిజన కాలనీలో కిషోర్ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం సూపర్వైజర్లు రాజేశ్వరి, కల్పలత ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా కిషోర్ బాలికలకు ఆరోగ్యం, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక వికాసం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఐవీఆర్ కాల్స్ సేవల ప్రాముఖ్యతను వివరించి, వాటి ద్వారా ఆరోగ్యం, పోషకాహారం, సంక్షేమ పథకాల సమాచారాన్ని సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకుని తమ అభివృద్ధికి అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవాలని బాలికలకు సూచించారు .కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

# బిజినెస్

## బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల.. ఈరోజు ఎలా ఉన్నాయంటే..



శనివారం నాడు బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గడం, డాలర్ బలపడడం మొదలైన కారణాలతో పసిడి ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,720గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,42,740గా ఉంది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,870గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,42,890గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా స్వల్ప తగ్గుదలను నమోదు చేశాయి కిలోకు వంద రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,79,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,74,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,79,900గా, బెంగళూరులో రూ.2,74,900గా ఉంది.

## ట్రైన్ టికెట్ దొరకట్లేదా.. అసలు కారణం ఇదే!




ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు.. అవినీతి, మోసపూరిత కార్యకలాపాలను అరికట్టేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ కీలక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా రైల్వే టికెట్ల బుకింగ్‌లో జరుగుతున్న అక్రమాలను నియంత్రించేందుకు ఈ సన్నాహాలు చేస్తోంది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ.. రైలు టికెట్లు పొందడం ప్రయాణికులకు చాలా కష్టంగా మారింది. టికెట్ బుకింగ్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే సీట్లు పూర్తవుతున్నాయని చాలామంది ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణంగా బాట్స్, టౌట్స్, నకిలీ ఖాతాలు, మోసపూరిత యూజర్ ఐడీలు అని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ మూడు కోట్లకు పైగా అనుమానాస్పద యూజర్ ఐడీలను డీయాక్టివేట్ చేసింది. అదనంగా మరో ఆరు కోట్ల ఖాతాలను పరిశీలన కోసం గుర్తించింది. టికెట్ బుకింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా.. 4.2 లక్షల అనుమానాస్పద పీఎన్‌ఆర్‌లకు సంబంధించిన 501 ఫిర్యాదులను నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదు చేసింది. అలాగే నకిలీ డిజిటల్ గుర్తింపులతో సంబంధం ఉన్న 13,343 అనుమానాస్పద ఈమెయిల్ డొమైన్‌లను కూడా బ్లాక్ చేసింది. ఈ చర్యల వల్ల ప్రయాణికులకు టికెట్లు అందుబాటులోకి రావడం సులభమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# అంచనాలను మించిన భారత జీడీపీ

న్యూఢిల్లీ: దేశీయంగా వినియోగానికి డిమాండ్ పటిష్టంగా ఉండటం, ప్రభుత్వం కూడా గణనీయంగా వ్యయాలు చేయడంతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనాలకు మించి వృద్ధి చెందింది. 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఇది 7 శాతంగాను, తాజా క్యూ3లో 8 శాతంగాను నమోదైంది. ఇక వినియోగం, పెట్టుబడులు మెరుగ్గా ఉండటంతో పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను జీడీపీ 7.7 శాతం మేర వృద్ధి చెందింది. 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 7.1 శాతంగా నమోదైంది. కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అంతర్జాతీయంగా పరిస్థితులు మెరుగుపడితే 2028 ఆర్థిక సంవత్సరంలో భారత్ మళ్లీ 7 శాతానికి పైగా వృద్ధి సాధించవచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ తెలిపారు. ఆర్‌బీఐ అంచనా వేస్తున్నట్లుగా 2027 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7 శాతం లోపునకు నెమ్మదించినా, స్థూల ఆర్థిక స్థిరత్వానికి ప్రభుత్వం తీసుకునే పాలసీపరమైన చర్యలనేవి ఎకానమీ మళ్లీ 7 శాతం పైగా వృద్ధి రేటువైపు మళ్లేందుకు దోహదపడగలవని పేర్కొన్నారు. స్థిర ధరల ప్రాతిపదికన వాస్తవ జీడీపీ 2025--26లో రూ. 323.12 లక్షల కోట్ల స్థాయిలో ఉంటుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) పేర్కొంది. ప్రస్తుత ధరల్లో నామినల్ జీడీపీ రూ. 346.36 లక్షల కోట్ల స్థాయిలో ఉండొచ్చని వివరించింది. 2025--26లో నిర్మాణం, తయారీ, ట్రేడ్, హోటల్స్, రియల్ ఎస్టేట్, ఐటీ తదితర సెకండరీ, టర్షరీ రంగాలు వరుసగా 8.8 శాతం, 9.3 శాతం వృద్ధి చెందాయి. వ్యవసాయం, ఫిషరీ రంగాల దన్నుతో ప్రైమరీ సెక్టార్ 3.6 శాతం వృద్ధి చెందింది.




**పశ్చిమాసియా ప్రభావం క్యూ1లో ..**

పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం జనవరి--మార్చి త్రైమాసికంలో ఒక నెలలోనే కనిపించింది. కీలకమైన ముడి చమురు, నేచురల్ గ్యాస్, ఎల్‌పీజీపరంగా సంక్షోభ పూర్తి ప్రభావం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్--జూన్) కనిపించనుంది. ఇంధనాలు, కమోడిటీల ధరలు భారీ స్థాయిలో తిరుగాడుతుండటం, సరఫరా వ్యవస్థలో ఆటంకాలు తదితర సవాళ్ల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాలను రిజర్వ్ బ్యాంక్ 6.9% నుంచి 6.6 శాతానికి తగ్గించింది.

**సంస్కరణల ఎక్స్‌ప్రెస్ దూకుడు..**

గ్లోబల్ సవాళ్ల నడుమ ఆర్థిక ప్రగతి సాధించే దిశగా పాలసీలపరంగా నిర్ణయాత్మక చర్యలతో సంస్కరణల ఎక్స్‌ప్రెస్ దూకుడుని కొనసాగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎక్స్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పోస్ట్ చేశారు.

# ఏఐ దాహం.. ప్రపంచానికి కొత్త సవాల్!

కృత్రిమ మేధస్సు సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు కారణమవుతోంది. విద్య, వైద్యం, పరిశ్రమలు, రవాణా, వినోదం వంటి అనేక రంగాల్లో ఏఐ వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. అయితే.. ఈ అభివృద్ధి వెనుక సమస్యలు కూడా ఉన్నాయని, ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాల కంటే.. దాని కోసం అవసరమయ్యే నీరు, విద్యుత్, భూమి వినియోగం భవిష్యత్తులో పెద్ద సవాలుగా మారవచ్చని యూఎన్‌యూ హెచ్చరించింది. ఏఐ వ్యవస్థలు పనిచేయడానికి భారీ డేటా సెంటర్లు అవసరం. ఈ డేటా సెంటర్లలో వేలాది సర్వర్లు నిరంతరం పనిచేస్తుంటాయి. దీంతో సర్వర్లు అధిక ఉష్ణోగ్రతలకు లోనవుతాయి. అలాంటప్పుడు వీటిని చల్లబరచడానికి భారీ మొత్తంలో నీరు అవసరమవుతుంది. యూఎన్‌యూ నివేదిక ప్రకారం.. 2030 నాటికి డేటా సెంటర్లు వినియోగించే నీరు, ప్రపంచంలోని 1.3 బిలియన్ మంది ప్రజల ప్రాథమిక గృహ అవసరాలను తీర్చగల స్థాయిలో ఉండవచ్చని అంచనా. ఇది ప్రస్తుతం మొత్తం ఆఫ్రికా ఖండ జనాభాకు సమానం అని తెలుస్తోంది. ఇప్పటి వరకు ఏఐ గురించి జరిగిన చర్చల్లో కార్బన్ ఉద్గారాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. కానీ నీటి వినియోగం కూడా అంతే ముఖ్యమైన సమస్యగా మారుతోందని పరిశోధకులు చెబుతున్నారు. ఏఐ మోడళ్లను నడపడానికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియలోనూ, సర్వర్ల శీతలీకరణలోనూ భారీ స్థాయిలో నీటి వినియోగం ఉంటుంది. విద్యుత్ వినియోగం విషయంలో కూడా.. పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. 2030 నాటికి ఆధారిత డేటా సెంటర్లు ప్రతి సంవత్సరం సుమారు 945 టెరావాట్ గంటల విద్యుత్‌ను వినియోగించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఇది పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియా దేశాల వార్షిక విద్యుత్ వినియోగాన్ని కలిపినా వచ్చే మొత్తానికి దాదాపు మూడు రెట్లు ఎక్కువ. ఏఐ అనేది కేవలం డిజిటల్ సాంకేతికత మాత్రమే కాదని నివేదిక స్పష్టం చేసింది. దీనికి అత్యాధునిక కంప్యూటర్ చిప్స్, భారీ డేటా సెంటర్లు, శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ మౌలిక సదుపాయాలు అవసరం. ఇవన్నీ భూమి వనరులపై గణనీయమైన ఒత్తిడిని కలిగిస్తాయి. డేటా సెంటర్ల నిర్మాణం కోసం విస్తారమైన భూభాగం అవసరమవుతుంది. అదనంగా చిప్‌ల తయారీ ప్రక్రియలో కూడా విలువైన ఖనిజాలు, నీరు, పవర్ పెద్ద మొత్తంలో వినియోగించాల్సి ఉంటుంది. అయితే.. ఇక్కడ ఐక్యరాజ్యసమితి ఏఐ అభివృద్ధిని నిలిపివేయాలని సూచించడం లేదు. బదులుగా ప్రభుత్వాలు, టెక్నాలజీ సంస్థలు, వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించా లని కోరుతోంది. కొత్త ఆవిష్కరణలతో పాటు నీటి వినియోగం, విద్యుత్ అవసరాలు, భూమి వినియోగం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తోంది. ఏఐ మానవ జీవితాన్ని సులభతరం చేస్తున్నప్పటికీ దాని వెనుక దాగి ఉన్న పర్యావరణ వ్యయాన్ని విస్మరించకూడదు. భవిష్యత్తులో సాంకేతిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను సాధించడం ప్రపంచ దేశాల ముందున్న ప్రధాన సవాలు. కాబట్టి ా× వల్ల కలిగే ప్రయోజనాలను ఆస్వాదిస్తూనే, దాని పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే మార్గాలను అన్వేషించడం చాలా అవసరం.



# స్పోర్ట్స్

# ఆఫ్ఘనిస్థాన్‌తో వన్డే సిరీస్..

## కోహ్లీ స్థానంలో జట్టులోకి యశస్వి జైస్వాల్

ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టులోకి యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. గాయపడిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకుంటున్నట్లు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రకటించారు. జైస్వాల్ తన చివరి వన్డేలో సౌతాఫ్రికాపై అజేయ సెంచరీ (116 పరుగులు, నాటౌట్) తో అదరగొట్టడం విశేషం. ఇదే సిరీస్‌లో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ హార్దిక్ పాండ్యా ఆడటం వారి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టంచేశారు. వెన్నునొప్పితో బాధపడుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఇప్పటికే బెంగళూరులోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో రిహాబిలిటేషన్‌లో ఉండగా.. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న రోహిత్ కూడా త్వరలో అక్కడికి చేరుకుని ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతున్నప్పుడు కోహ్లీకి తొడ కండరానికి గాయమైంది. ఆ మ్యాచ్‌లో 75 పరుగులతో జట్టును గెలిపించినప్పటికీ ఆ తర్వాత గాయం తీవ్రత ఎక్కువవడంతో అతడు ఈ సిరీస్‌కు దూరమవాల్సి వచ్చింది. జూలైలో జరిగే ఇంగ్లండ్ వన్డే సిరీస్ నాటికి కోలుకునే అవకాశం ఉందని అగార్కర్ చెప్పారు. భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య వన్డే పోరు జూన్ 13న ధర్మశాల వేదికగా ప్రారంభం కానుంది. ఆ తర్వాత మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు జూన్ 17న లక్నోలో, జూన్ 20న చెన్నైలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్ ముగిసిన తర్వాతే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే పూర్తిస్థాయి భారత వన్డే జట్టును సెలెక్టర్లు ప్రకటించనున్నారు. రోహిత్, హార్దిక్‌లు ఫిట్‌నెస్ సాధిస్తేనే ఈ సిరీస్‌లో ఆడతారని, లేదంటే జట్టులో మరికొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.






## ఒత్తిడి ఉండే కీలక టోర్నీల్లో అతడు గేమ్ ఛేంజర్‌గా మారగలడు.. భారత జట్టులోకి వైభవ్ ఎంపికపై బీసీసీఐ ఫస్ట్ రియాక్షన్

భారత క్రికెట్‌లో ఓ యువ సంచలనం సరికొత్త చరిత్ర సృష్టించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ ఏకంగా భారత సీనియర్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతోపాటు ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత టీ20 జట్లలోనూ అతడికి స్థానం లభించింది. దాంతో భారత పురుషుల సీనియర్ జట్టుకు ఎంపికైన అత్యంత పిన్నవయస్కుడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. ఈ సందర్భంగా బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వైభవ్ ప్రతిభపై ప్రశంసల వర్షం కురిపించారు. వైభవ్ కీలక టోర్నీల్లో గేమ్ ఛేంజర్‌గా మారగలడని అన్నారు. యువ క్రికెటర్‌గా వైభవ్ అసాధారణ ప్రదర్శన కనబరుస్తున్నాడని కొనియాడారు. 'ఒక యువ ఆటగాడి గురించి ఏం చెప్పగలం..? అతడు ఏం చేయగలడో మీరంతా చూశారు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో కూడా దాదాపు ఒంటిచేత్తో రాజస్థాన్ రాయల్స్‌ను నడిపించాడు. అతని బ్యాటింగ్ గురించి నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సీజన్‌లోనే కాదు, గత సీజన్‌లోనూ అద్భుతంగా ఆడాడు. ఐపీఎల్ లాంటి అత్యంత పోటీ, ఒత్తిడి ఉండే టోర్నమెంట్‌లో అతడు ఎంతో విధ్వంసకరంగా, గేమ్ ఛేంజర్‌గా మారగలడు' అని అగార్కర్ చెప్పారు. క్రికెట్‌ను, ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌ను చూసేవారికి వైభవ్‌పై భారీ అంచనాలున్నాయని అన్నారు. అతడు తన ప్రదర్శనతోనే జట్టులో చోటు దక్కించుకున్నాడని చెప్పారు.




## అండర్18 హాకీ.. భారత మహిళల జట్టుకు కాంస్య పతకం



**కాకామిగహర:** జపాన్‌లో జరుగుతున్న మహిళల అండర్ 18 ఆసియాకప్ హాకీ(ఔశీఎవఅం ఖ18ాంఙు జబజూ)లో భారత జట్టుకు కాంస్య పతకం దక్కింది. మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో కొరియాపై విజయాన్ని నమోదు చేసింది. సందీప్ కుమారి, స్వీటీ కుజుర్, నౌషీన్ నాజ్‌లు భారత్ తరపున గోల్స్ చేశారు. సెమీఫైనల్స్ మ్యాచ్‌లో చైనా చేతిలో షూటౌట్ ఓడిన భారత జట్టు బ్రాంజ్ మెడల్ ఫైట్‌లో గట్టిగా పోరాడింది. ఆరంభంలోనే డ్రీమ్ స్టార్ట్ అందింది. తొలి రెండు నిమిషాల్లోనే సందీప్ కుమారి గోల్స్ చేసింది. దీంతో ఇండియా ఈ మ్యాచ్‌లో దూకుడు ప్రదర్శించింది. మ్యాచ్ మొత్తం ఇండియా జట్టు అటాక్ చేసింది. ఇక ఆట 16వ నిమిషంలో స్వీటీ కుజుర్ ఫీల్డ్ గోల్‌తో ఆధిక్యాన్ని పెంచింది. రెండు గోల్స్‌తో భారత మహిళల జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఆ తర్వాత మళ్లీ 33వ నిమిషంలో భారత్‌కు మరో గోల్ దక్కింది. నౌషీన్ ఆ గోల్ స్కోరు చేసింది. ఈ టోర్నీలో నౌషీన్ తన ఖాతాలో మొత్తం 12 గోల్స్ వేసుకున్నది. సందీప్ కుమారి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నది.

# టాలీవుడ్ హీరోయిన్ల పాత్రలపై విమర్శలు.. గట్టి కౌంటర్ ఇచ్చిన నటి ఆషికా రంగనాథ్!



సౌత్ ఇండియన్ కమర్షియల్ సినిమాలలో, ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరోల చిత్రాలలో హీరోయిన్ల పాత్రల నిడివి, వారి ఎంపికలపై వచ్చే విమర్శలకు ప్రముఖ నటి ఆషికా రంగనాథ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. రామ్ చరణ్, ఎన్టీఆర్ వంటి టాప్ స్టార్స్ సరసన కేవలం భారీ రెమ్యునరేషన్, క్రేజ్ కోసమే హీరోయిన్లు నటిస్తున్నారని, నటనకు స్కోప్ లేని పాత్రలను గుడ్డిగా ఒప్పుకుంటున్నారని విమర్శకులు చేసే ఆరోపణలను ఆమె తీవ్రంగా తిప్పికొట్టారు. నటీమణులకు మద్దతుగా పరిశ్రమలోని అసలు వాస్తవాలను వివరిస్తూ ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు ప్రాధాన్యత లేకుండా పోవడానికి నటీమణులను నిందించడం ముమ్మాటికీ తప్పని, దీని వెనుక సినిమా ఇండస్ట్రీ నడిచే ఒక పెద్ద వ్యాపార వ్యవస్థ ఉందని ఆషికా పేర్కొన్నారు. చాలా మంది హీరోయిన్లకు ఇలాంటి భారీ పాన్-ఇండియా సినిమాల్లో నటించడం అనేది కేవలం నటనకు సంబంధించిన ఎంపిక మాత్రమే కాదని, తమ కెరీర్‌ను మార్కెట్‌లో నిలబెట్టుకోవడానికి చేసే ఒక వ్యూహాత్మక నిర్ణయమని (హ్రీఫ్వస్త్రఅఎ స్పష్టం చేశారు. సాధారణంగా పెద్ద కమర్షియల్ చిత్రాలలో హీరోయిన్ పాత్రలు కేవలం యాక్షన్ సీక్వెన్స్‌ల మధ్యలో వచ్చే గ్లామరస్ విరామాలు లాంటివని, హీరోయిన్ స్వంత ఇమేజ్ కంటే హీరో ఎలివేషన్‌ను పెంచేలాగే ఆ పాత్రలను చాలా జాగ్రత్తగా డిజైన్ చేస్తారని అభిప్రాయపడ్డారు. అందుకే నటీమణులపై అనవసర నిందలు వేయడం ఆపి, ఇప్పటికీ ఇలాంటి గ్లామర్ పాత్రలనే ప్రేక్షకులు ఇష్టపడతారని నమ్ముతున్న మేకర్స్‌ను, ఈ పాతకాలపు వ్యవస్థను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. నటీనటులు ఎప్పుడైనా తమకు వచ్చే అవకాశాల పరిధిలోనే బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తారని, పెద్ద ప్రాజెక్టులలో భాగమవడం ద్వారా దేశవ్యాప్తంగా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తారని తెలిపారు. ఒక సినిమాలో హీరోయిన్ పాత్ర సరిగ్గా రాయబడకపోతే ఆ తప్పు రచయితలు, దర్శకులదే కానీ.. ఆ పాత్రల్లో నటించిన మహిళలది కాదని ఆషికా రంగనాథ్ చెప్పుకొచ్చారు.




## మూడు భాషల్లో డబ్బింగ్ చెప్పిన విజయ్ సేతుపతి.. జూన్ 8న 'స్లమ్‌డాగ్' టీజర్

టాలీవుడ్ దర్శకుడు పూరీ జగన్నాథ్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ప్యాన్ ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్ర టీజర్ కోసం నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి డబ్బింగ్ పూర్తి చేసినట్లు పూరీ జగన్నాథ్ శనివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ అప్‌డేట్‌లో అసలు విషయం ఏంటంటే.. విజయ్ సేతుపతి కేవలం ఒక భాషలోనే కాకుండా ఏకంగా మూడు భాషల్లో (తెలుగు, తమిళం, హిందీ) స్వయంగా డబ్బింగ్ చెప్పారు. ఈ విషయాన్ని పూరీ జగన్నాథ్ తన ఎక్స్ ఖాతాలో పంచుకుంటూ, విజయ్ సేతుపతి తన సొంత వాయిస్‌తో మూడు భాషల టీజర్‌కు అద్భుతమైన వాయిస్‌ను అందించారని, ఈ చిత్ర టీజర్‌ను జూన్ 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గతేడాది జూలైలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రేక్షకుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తిగా ముగిసిందని, ప్రస్తుతం అన్ని భాషలకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి స్టైలిష్ గాగుల్స్ ధరించి, చేతిలో రక్తం అంటిన కత్తితో, కరెన్సీ నోట్ల పెట్టెల మధ్య నిలబడి ఉన్న లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరీ జగన్నాథ్, ఛార్మీ కౌర్, జేబీ నారాయణరావు కొండ్రొల్ల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జేబీ మోషన్ పిక్చర్స్ భాగస్వామ్యంతో ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటి టబు, కన్నడ స్టార్ దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరి పాత్రలు కథను మలుపు తిప్పే విధంగా ఎంతో బలంగా ఉంటాయని సమాచారం. హీరోయిన్ సంయుక్త పాత్ర ఎమోషనల్ గా, నటనకు మంచి స్కోప్ ఉన్నదిగా ఉంటుందని, ఈ పాత్ర పట్ల ఆమె ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో తన అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.




## సుడిగాలి సుధీర్‌కి జోడీగా బిగ్ బాస్ బ్యూటీ

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్స్ జోకర్'. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు హీరోయిన్ అయేషా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'సుధీర్స్ జోకర్' చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. రీసెంట్ గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన 'సుధీర్స్ జోకర్' మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి.

## సమాజంలో మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతోంది.. బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ద్వంద్వ ప్రమాణాలపై, పితృస్వామ్య మనస్తత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురీ దీక్షిత్. ప్రేమ, బంధాల విషయంలో పురుషులను ఒకలా, స్త్రీలను మరోలా చూసే వివక్ష సమాజంలో ఇంకా బలంగా నాటుకుపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పురుషుల శృంగార ఎంపికలను సమాజం గొప్పగా చూస్తుందని, అదే సమయంలో మహిళలు అలాంటి ఎంపికలు చేసుకుంటే తప్పుగా చిత్రీకరిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఇది పూర్తిగా పితృస్వామ్య సమాజమని, కాలం మారుతున్నా మొదటి నుంచి ఉన్న ఆ పాత ఆలోచనలే కొనసాగుతున్నాయని విమర్శించారు. పురుషుడికి ఎక్కువ మంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉంటే అతడిని 'క్యాసనోవా' అని పిలుస్తూ గొప్పగా చూస్తారని, అదే ఒక మహిళకు ఎక్కువ మంది బాయ్‌ఫ్రెండ్స్ ఉంటే ఆమెను ఎంతో నెగెటివ్‌గా చూస్తూ రకరకాల పేర్లతో దూషిస్తారని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న తన తాజా చిత్రం 'మా బెహన్' సమాజం సృష్టించిన ఇలాంటి సాంప్రదాయ నిబంధనలను, కట్టుబాట్లను బద్దలు కొడుతుందని 59 ఏళ్ల మాధురీ దీక్షిత్ తెలిపారు. ఈ సినిమాలో సమాజం సృష్టించిన ప్రతి నియమాన్ని తాము బ్రేక్ చేశామని, ఆ పాత్రలు చేస్తున్నప్పుడు తాము ఎంతో ఆనందించామని చెప్పారు. ఇందులోని పాత్రలు ఎంతో గందరగోళంగా, నిజ జీవితంలో ఉండే సాధారణ మనుషులకు ఎంతో దగ్గరగా, రిలేటబుల్‌గా ఉంటాయని ఆమె వివరించారు. సురేష్ త్రివేణి దర్శకత్వంలో తెరకెక్కిన 'మా బెహన్' ఒక బ్లాక్ కామెడీ థ్రిల్లర్ చిత్రం. ఇందులో మాధురీ దీక్షిత్‌తో పాటు తృప్తి డిమ్రి, ధరణ దుర్గా, రవి కిషన్, గీతాంజలి కుల్కర్ణి, అరుణోదయ్ సింగ్, శార్దూల్ భరద్వాజ్ కీలక పాత్రలు పోషించారు.

